నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
ఆదిలాబాద్
ఆదివారం | డిసెంబర్ 01, 2024 | www.navatelangana.com

రాష్ట్రస్థాయి పోటీల్లో ఫైనల్‌కు చేరిన జిల్లా జట్టు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

నిజాంబాద్ జిల్లా ఆర్మూర్ పట్టణంలో జరుగుతున్న 46వ తెలంగాణ రాష్ట్ర స్థాయి జూనియర్ బాలికల హ్యాండ్ బాల్ పోటీల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జట్టు ఫైనల్ చేరింది. శనివారం రంగారెడ్డి జిల్లా జట్టుతో జరిగిన సెమీఫైనల్‌లో 17-05 గోల్స్ తేడాతో గెలుపొంది ఫైనల్‌కు చేరినట్లు హ్యాండ్ బాల్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు శ్యాంసుందర్‌రావు, కార్యదర్శి కనపర్తి రమేష్ తెలిపారు. ఆదివారం ఫైనల్‌లో మహబూబ్‌నగర్ జట్టుతో తలపడనున్నట్లు తెలిపారు. ఫైనల్‌కు చేరిన జిల్లా జట్టును కోచ్‌లు సునార్కార్ అరవింద్, గోగర్ల సాయితో పాటు పలువురు అభినందించారు.



పరిహారం చెక్కు అందజేత

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ మండలం గన్నారం గ్రామానికి చెందిన మోర్లె లక్ష్మి శుక్రవారం పులి దాడిలో మృతి చెందిన విషయం తెల్సిందే. ఈ కుటుంబానికి ప్రభుత్వం నుండి మంజూరైన రూ. 10 లక్షల పరిహారం చెక్కును శనివారం ఎఫ్‌డీఓ కార్యాలయంలో డీఎఫ్‌ఓ నీరజ్ టిబ్రేవాల్ బాధిత కుటుంబసభ్యులకు అందించారు. ఇరు కుటుంబాల అంగీకారంతో లక్ష్మి భర్త మోర్లె వాసుదేవ్‌కు రూ. 5 లక్షలు, లక్ష్మి తల్లి వడై విమలకు రూ. 5 లక్షల చొప్పున రెండు చెక్కులను ఆయన అందించారు. ఈ కార్యక్రమంలో గన్నారం మాజీ సర్పంచ్ దోతుల శ్రీనివాస్, నాయకులు పాల్వాయి సుధాకర్‌రావు, కొప్పుల శంకర్, నీరటి సత్యనారాయణ, సిందం శ్రీనివాస్, పుల్ల అశోక్ పాల్గొన్నారు.



ధాన్యం తూకంలో మోసం చేయొద్దు



నవతెలంగాణ-ఖానాపూర్

వరి ధాన్యం తూకంలో రైతులను మోసం చేయవద్దని సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శి గౌతమ్ కృష్ణ అన్నారు. శనివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఖానాపూర్ ఏరియా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి ధాన్యం తూకంలో బస్తాకు కేజీన్నర తగ్గించడం సరైనది కాదన్నారు. గత పాలకులు చేసిన తప్పిదాలే ఇప్పుడున్న ప్రభుత్వం చేస్తుందన్నారు. ఐకెపి ఆధ్వర్యంలో జరుగుతున్న దోపిడీ కాకుండా రైస్ మిల్లుకు వడ్లు తీసుకెళ్లిన తర్వాత రైస్ మిల్లర్స్ కోత విధించి డబ్బులు చెల్లిస్తున్నారని తెలిపారు. మామడ మండల కేంద్రంలోని రైస్ మిల్లులో 20 బస్తాలు కోత విధించిన రైస్ మిల్లర్‌కు వ్యతిరేకంగా పార్టీ ఆధ్వర్యంలో కడెం మండలంలోని సారంగాపూర్ గ్రామానికి చెందిన రైతు రమేష్ వాగ్వాదానికి దిగాడన్నారు. ఆ తర్వాత మామడ తహసీల్దార్‌ను కలిసి ఆందోళన చేయడంతో వెంటనే కోత లేకుండా వరి ధాన్యాన్ని కొనుగోలు చేశారని అన్నారు. అయినా ఆ రైతును ఒప్పించి నాలుగు బస్తాలు కోత విధించారని అన్నారు. రైతులు అదనపు తూకానికి వ్యతిరేకంగా పోరాడాలని, రైస్ మిల్లర్ల దోపిడీకి వ్యతిరేకంగా పోరాటం చేయాలని తెలిపారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బొమ్మెన సురేష్, ఖానాపూర్ ఏరియా కమిటీ కార్యదర్శి దుర్గం నూతన్ కుమార్, ఏరియా కమిటీ సభ్యులు దాకూరు తిరుపతి, నాగెల్లి నర్సయ్య, రజిత, రాధ, నారాయణ, నరేష్, రాజేష్, ఎస్ఎఫ్ఐ నాయకురాలు నీరజ పాల్గొన్నారు.

ఆస్తి పన్ను వసూలు వంద శాతం పూర్తి చేయాలి

- అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్



నవతెలంగాణ-నిర్మల్

ఆస్తి పన్ను వసూలు వంద శాతం పూర్తి చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మున్సిపల్ శాఖ అధికారులతో అదనపు కలెక్టర్ పలు అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. పట్టణ ప్రాంతాలలో వాణిజ్య, గృహ తదితర పన్నుల వసూలు త్వరితగతిన వందశాతం పూర్తి చేయాలన్నారు. సకాలంలో పన్నులు చెల్లించని వారికి చట్ట ప్రకారం నోటీసులు జారీ చేసి చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటివరకు వసూలు చేసిన పన్నులు, బకాయి పన్నులకు సంబంధించి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. సింగిల్ యూసేజ్ ప్లాస్టిక్ నిషేధాన్ని పకడ్బందీగా అమలు చేయాలన్నారు. పట్టణ ప్రాంతాలలో నిరంతరం మెరుగైన పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అనునిత్యం అన్ని విద్యుత్ దీపాలు సక్రమంగా వెలిగేలా పర్యవేక్షణ ఉండాలన్నారు. పట్టణ ప్రాంతాలలోని అన్ని రకాల వ్యాపారస్తులు తప్పనిసరిగా వాణిజ్య లైసెన్సులు కలిగి ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. కొత్త మంచినీటి కుళాయిల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. పట్టణ ప్రాంతాలలో నడుస్తున్న మహిళా శక్తి క్యాంటీన్ల నిర్వహణ తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో నిర్మల్, భైంసా, ఖానాపూర్ మున్సిపల్ కమిషనర్లు ఖమర్ అహ్మద్, మనోహర్, రాజేష్ కుమార్ లు మెప్మా పీడీ సుభాష్, శానిటరీ ఇన్స్పెక్టర్లు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీడీఓ కేజీబీవీ తనిఖీ



నవతెలంగాణ-బెజ్జూర్

మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల విద్యాలయాన్ని శనివారం మండల అభివృద్ధి అధికారి గౌరీశంకర్ తనిఖీ చేశారు. కలెక్టర్, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వసతి గృహాలను సందర్శించి వంటశాలలను, వంటలను పరిశీలించారు. వంట సామాగ్రి స్టాక్ రూమ్ పరిశీలించారు. మరుగుదొడ్లు, వసతిగృహ పరిసర ప్రాంతాలు పరిశుభ్రత పాటించాలన్నారు. విద్యార్థులు సిబ్బంది హాజరు రిజిస్టర్‌లను పరిశీలించారు. ప్రభుత్వ నిబంధన మేరకు విద్యార్థులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని సూచించారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ పెట్టాలని, నాణ్యమైన విద్యతోపాటు పౌష్టికాహారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి తుకారం ప్రత్యేక అధికారిణి అరుణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మౌళిక వసతుల కోసం నిధులు మంజూరు

ముథోల్ : నియోజకవర్గంలో గతంలో నూతన కాలనీలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్‌ల వద్ద మౌళిక సదుపాయాల కల్పించటానికి ప్రభుత్వం రూ.5కోట్ల94లక్షల61వేలు మంజూరు చేసిందని మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నియోజకవర్గంలో ముథోల్, వడ్తల్, భైంసా, దేగాం, కామోల్, మాటేగాం, హంపోలి, మాలేగాం, రాజురా, సాంవ్లీ, కుప్టి, వర్ని, హల్దా, లింబా-బి ,పెంచకల్‌పాడ్, సాత్‌గాం గ్రామాల్లో డబుల్ బెడ్ రూమ్‌లు నిర్మించిన కాలనీలో మౌళిక వసతుల కోసం ఈ నిధులు మంజూరైనట్లు పేర్కొన్నారు. ఈ పనులకు ప్రభుత్వం త్వరలో టెండర్లు పిలుస్తుందన్నారు. నిధుల మంజూరు చేసిన సిఎం రేవంత్‌రెడ్డి, రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, జిల్లా ఇన్చార్జి మంత్రి సీతక్కకు మాజీ ఎమ్మెల్యే ప్రత్యేక ధన్యావాదాలు తెలిపారు.

పులి ఒకచోట..గాలింపు మరో చోట..!

- పులి కదలికలను పసిగట్టడంలో విఫలమవుతున్న అటవీ శాఖ
- మరో రైతుపై పంజా విసిరిన పులి
- రైతుకు తీవ్ర గాయాలు
- భయం గుప్పిట్లో గ్రామాలు

కాగజ్‌నగర్ అటవీ డివిజన్‌ను బెబ్బులి బెంబేలెత్తిస్తోంది. మహారాష్ట్ర నుండి వచ్చిన పులి గంట గంటకు వేరే ప్రాంతానికి వెళుతూ స్థానికుల కంట పడుతోంది. దీంతో ఆయా గ్రామాల ప్రజలు హడలెత్తిపోతున్నారు. ఈ పులి కదలికలను పసిగట్టడంలో అటవీ శాఖ పూర్తిగా వైఫల్యం చెందుతోంది. పులి ఒకచోట ఉంటే మరో చోట అటవీ అధికారులు డ్రోన్లతో గాలింపు చేపడుతున్నారు.

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ మండలం గన్నారం గ్రామానికి చెందిన మోర్లె లక్ష్మి పులి దాడిలో శుక్రవారం మృతి చెందిన విషయం తెల్సిందే. అప్పటి నుండి డివిజన్ పరిధిలోని గ్రామాలు పులి అంటేనే హడలెత్తిపోతున్నారు. పులి ఇంకా ఈ ప్రాంతంలోనే సంచరిస్తుండడంతో ఎపుడు ఏం జరుగుతుందోనని ఆయా మండలాల వాసులు భయాందోళనకు గురవుతున్న సమయంలోనే ఈ పులి సిర్పూర్(టి) మండలంలో ప్రత్యక్షమైంది. ఈ మండలంలోని దుబ్బగూడ గ్రామానికి చెందిన రైతు సురేష్ తన పొలానికి వెళ్లగా అక్కడ పులి వెనుక నుండి పంజా విసిరింది. పులి పంజాతో సురేష్ మెడ వెనుక తీవ్ర గాయాలయ్యాయి. ఇతన్ని మెరుగైన చికిత్స కోసం మంచిర్యాలకు తరలించారు. 24 గంటల వ్యవధిలోనే పులి ఇద్దరిపై దాడి చేయడంతో గ్రామీణులు పంట పొలాలకు వెళ్లేందుకు జంకుతున్నారు. శనివారం మధ్యాహ్నం వల్లకొండ పంచాయతీ పరిధిలోని గొల్లగూడ గ్రామస్థులకు పులి కంటపడిందని అటవీ అధికారులకు సమాచారం అందగా, వారు వెళ్లి గమనిస్తే అది అడవి కుక్కగా తేలింది. సాయంత్రం కాగజ్‌నగర్ మండలం ఊట్‌పెల్లిలో పులి కనిపించిందనే సమాచారం వచ్చింది. అడవి జంతువు ఏదీ కనపడ్డా అది పులేననే భయాందోళనలో గ్రామస్థులు ఉన్నారు.

పులి జాడలను ఎందుకు పసిగట్టలేకపోతున్నారు?

మహారాష్ట్ర నుండి వచ్చిన ఈ పులి ఆడపులా, మగపులా అనేది ఇప్పటి వరకు అధికారులు పసిగట్టలేదు. ఇది ఏ ప్రాంతం నుండి వచ్చిందనే విషయంలో కూడా స్పష్టత లేదు. మరో పులిని కలిసేందుకు ఈ ప్రాంతంలో తిరుగుతోందని, ఈ సమయంలో పులి రోజుకు 30 నుండి 40 కిలోమీటర్లు పయనించే అవకాశాలు ఉన్నట్లు అటవీ అధికారులు చెపుతున్నారు. కాని శుక్రవారం ఈజ్‌గాం బెంగాళీ క్యాంప్‌లలో తిరిగిన పులి జాడ కోసం అటవీ అధికారులు శనివారం ఆ ప్రాంతంలోనే డ్రోన్లతో గాలించారు. రైతు సురేష్‌పై దాడి తర్వాత సిర్పూరు రేంజ్ పరిధిలో డ్రోన్లతో గాలించారు. ఈ మండలంలోని ఇటికల్‌పహాడ్ గ్రామస్థులకు మాస్కులు పంపిణీ చేశారు. శుక్రవారం సంఘటన జరిగిన ప్రదేశానికి నాలుగు పక్కలా కొన్ని కిలోమీటర్ల వ్యవధిలో శుక్రవారమే డ్రోన్లతో గాలింపు చేపడితే పులి జాడ దొరికి ఉండేదనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. మోర్లె లక్ష్మిని హతమార్చిన పులే, సిర్పూరు (టి) మండలానికి వచ్చి రైతు సురేష్‌పై దాడి చేసి ఉండవచ్చని డీఎఫ్ఓ నీరజ్ టిబ్రేవాల్ చెపుతున్నారు. డివిజన్‌లో రెండో పులి ఉండే అవకాశం లేదని, ఒక్క పులే సంచరిస్తోందని ఆయన స్పష్టం చేస్తున్నారు.

మహారాష్ట్ర సరిహద్దుల్లోకి వెళుతోంది : నీరజ్ టిబ్రేవాల్, డీఎఫ్ఓ

సిర్పూర్(టి) మండలం దుబ్బగూడలో పులి దాడిలో తీవ్రంగా గాయపడ్డ రైతు సురేష్‌ను కాగజ్‌నగర్‌లోని ప్రైవేట్ ఆసుపత్రిలో డీఎఫ్ఓ నీరజ్ టిబ్రేవాల్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుతం పులి మహారాష్ట్రకు కేవలం 8 కిలోమీటర్ల దూరంలోఉందని అన్నారు. ఇది శనివారమే మన రాష్ట్రం దాటి మహారాష్ట్రకు వెళ్లిపోయే అవకాశముందని,. ఆయా గ్రామాల ప్రజలు మరో రెండు రోజులు పంట పొలాలకు వెళ్లకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పులి జాడలను ఎప్పటికప్పుడు మా సిబ్బంది కనిపెడుతున్నారని, అయినా దురదృష్టవశాత్తు పులి మనుష్యులపై దాడి చేస్తోందని అన్నారు.



సిర్పూరు మండలంలో పులి జాడ కోసం డ్రోన్లను ఉపయోగిస్తున్న అటవీ అధికారులు



పులి దాడిలో రైతు సురేష్ మెడపై అయిన గాయాలు

మ్యాన్ ఈటర్‌గా మారిందా...

డివిజన్‌లో సంచరిస్తున్న ఈ పులి మ్యాన్ ఈటర్‌గా మారితే మాత్రం రైతుల ప్రాణాలకు రక్షణ లేకుండా పోయే ప్రమాదముంది. అటవీ అధికారులు తెలిపిన ప్రకారం పులికి మనిషి రక్తం రుచి తెలియదు. కాని ఒక్కసారి ఆ రుచి తెలిసిందంటే మనుషులపై అదే పనిగా దాడి చేసే అవకాశముంటుంది. మోర్లె లక్ష్మిపై దాడి చేసిన పులికి మనిషి రక్తం రుచి తెలిసింది కాబట్టి ఇక అదే పనిగా కనిపించిన ప్రతి మనిషిపై దాడి చేసే అవకాశముంటుందని అటవీ సిబ్బందే చెబుతున్నారు.



అటవీ అధికారులు అందించిన మాస్కులతో ఇటికల్‌పహాడ్ గ్రామస్తులు (పులి దాడి చేయకుండా ఇవి ఉపయోగపడతాయి)

వసతిగృహ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

- నిర్మల్ అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్



నవతెలంగాణ-నిర్మల్

ప్రభుత్వ వసతి గృహ విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఎస్సీ, ఎస్టీ వసతి గృహ ప్రిన్సిపాళ్లు, అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ప్రభుత్వ వసతిగృహాల్లో చదివే ప్రతి విద్యార్థికి మెనూ ప్రకారం నాణ్యమైన, రుచికరమైన భోజనాన్ని అందించాలని ఆదేశించారు. మండలాల వారిగా వసతి గృహాల్లో ఉన్న విద్యార్థుల సంఖ్య, అందిస్తున్న భోజన, వసతి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. నాణ్యమైన కూరగాయలు, సరుకులు మాత్రమే వంటకు వినియోగించాలన్నారు. కూరగాయల సరఫరాదారులు వసతిగృహాలకు నాణ్యమైన కూరగాయలు, చికెన్, మటన్, కోడిగుడ్లు, అరటి పండ్లు, పాలు ఇతర సరుకులను సరఫరా చేయాలన్నారు. సరఫరాదారులు అందించిన వస్తువుల నాణ్యతను ప్రిన్సిపాళ్లు పరిశీలించాలని, వస్తువుల నాణ్యత సరిగా లేనట్లయితే వాటిని తిరిగి వెనక్కి పంపించాలని సూచించారు. కుళ్లిన, నిల్వ ఉంచిన కూరగాయలు, చికెన్, మటన్, కోడిగుడ్లను ఎట్టి పరిస్థితుల్లోనూ వంటకు ఉపయోగించరాదన్నారు. కూరగాయలను నేరుగా నేలమీద ఉంచకుండా తగిన ఏర్పాట్లు చేయాలని, వంటకు ముందు కూరగాయలను ఉప్పు నీటితో కడగాలని సూచించారు. వంటగది, స్టోర్ రూమ్, డైనింగ్ హాలును ప్రతి రోజు శుభ్రపరచుకోవాలన్నారు. వంట సిబ్బంది వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ, వంటకు ముందు చేతులు, కాళ్లను పరిశుభ్రంగా కడుక్కోవాలన్నారు. వంట చేసే సమయంలో తప్పనిసరిగా హెడ్ క్యాప్, మాస్క్, ఆప్రాన్ ధరించాలని, వంట పాత్రలను డిష్ వాషర్లతో శుభ్రపరచాలన్నారు. విద్యార్థులకు పరిశుభ్రమైన తాగునీటిని మాత్రమే అందించాలన్నారు. బియ్యం, పప్పు దినుసులను ఎప్పటికప్పుడు శుభ్రపరచాలన్నారు. వంట సరుకులు వసతి గృహానికి రాగానే వస్తువుల గడువు తేదీని రిజిస్టర్లలో నమోదు చేసి ఎప్పటికప్పుడు తనిఖీ నిర్వహించాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ గడువు తీరిన వస్తువులను వంటకు ఉపయోగించరాదని తెలిపారు. మరుగుదొడ్లను, వసతి గృహ పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ పరిశుభ్రతను పాటించాలని తెలిపారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులను పర్యవేక్షిస్తూ, విద్యార్థులు, ఉపాధ్యాయులతో మెస్ కమిటీలు నిర్వహించాలన్నారు. షిఫ్టుల వారిగా ఉపాధ్యాయులు వసతి గృహాల్లో బస చేయాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. సమావేశంలో ఎస్సీ సంక్షేమ అధికారి రాజేశ్వర్‌గౌడ్, డిటిడిఓ అంబాజీ పాల్గొన్నారు.

ఆశాలకు పెండింగ్ డబ్బులు వెంటనే చెల్లించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆశాలకు లెప్రసి, పల్స్ పోలియో పెండింగ్ డబ్బులు చెల్లించిన తర్వాతనే కొత్త సర్వేలు చేయించాలని ఆశా వర్కర్ యూనియన్(సీఐటీయూ) జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ అన్నారు. ఈ విషయమై శనివారం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 2నుండి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో లెప్రసి సర్వే చేయాలని జిల్లా అధికారులు ఆశాలకు చెబుతున్నారని అన్నారు. ఈ నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఆపాలని లెప్రసి, పల్స్ పోలియో పెండింగ్ డబ్బులు చెల్లించిన తర్వాతనే కొత్త సర్వేలు చేయించాలని కోరారు. రాష్ట్రంలో 2023లో సగం జిల్లాలకు, 2024లో మొత్తం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలకు ఆశాలు చేసిన లెప్రసి డబ్బులు, 2024లో చేసిన పల్స్ పోలియో డబ్బులు రాష్ట్ర ప్రభుత్వం నేటికీ ఆశాలకు చెల్లించలేదన్నారు. రెండు సంవత్సరాల నుండి చేసిన లెప్రసి సర్వే 2024లో చేసిన పల్స్ పోలియో డబ్బులు రాక ఆశాలు ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. సంవత్సరాల తరబడి చేసిన పనికి డబ్బులు చెల్లించకుండా రాష్ట్ర ప్రభుత్వం మోసం చేస్తోందని మండిపడ్డారు. ఇప్పుడు మళ్లీ కొత్తగా లెప్రసి సర్వే చేయాలని ఒత్తిడి చేయడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. పెండింగ్ బిల్లులు చెల్లించి ఆశాలను ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో సుజాత, సంగీత, పుష్ప, లక్ష్మీ ఉన్నారు.

పంటల్లో అధిక దిగుబడికి కృషి



నవతెలంగాణ-తాండూర్

బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం ద్వారా పంటలలో అధిక దిగుబడులు సాధించేందుకు కృషి జరుగుతోందని ఐసిఆర్ఐ డైరెక్టర్ షేక్ ఎస్ మీరా తెలిపారు. ఆయన శనివారం బెల్లంపల్లిలో జరిగిన కిసాన్ మేళా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై నూతన భవనాన్ని ప్రారంభించారు. మట్టి పరిశోధన కేంద్రాన్ని వర్మీ కంపోస్ట్ యూనిట్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రోగ్రాం కోఆర్డినేటర్ శివకృష్ణ మాట్లాడుతూ బెల్లంపల్లి జాతీయ పత్తి పరిశోధన సంస్థ నాగపూర్, వ్యవసాయ సాంకేతిక ప్రయోగ పరిశోధన సంస్థ(అటారి) (జోన్-10) ఆధ్వర్యంలో ఘనంగా కిసాన్ మేళను నిర్వహించామన్నారు. జాతీయ ఆహార భద్రత మిషన్ కింద ఉత్తమ పద్ధతుల ద్వారా మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాలలో రైతుల పత్తి ఆహార పంటల ఉత్పాదకతను పెంచేందుకు కృషి విజ్ఞాన కేంద్రం కృషి చేస్తుందని తెలిపారు. అందులో భాగంగా అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగుపై, ఆధునిక వ్యవసాయ సాంకేతికపై రైతు స్థాయిలో అవగాహన కల్పిస్తున్నామన్నారు. శాస్త్రవేత్త వీరన్న మాట్లాడుతూ అధిక సాంద్రతలో పత్తి యాజమాన్యం పద్ధతులను, తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. జిల్లా వ్యవసాయ అధికారి కల్పన మాట్లాడుతూ రైతులు యాసంగిలో తక్కువ నీటితో సాగయ్యే మొక్కజొన్న, కూరగాయ పంటలపై దృష్టి సారించాలన్నారు. ఆయిల్ ఫామ్ సాగు విధానంలో రైతులు అధిక లాభాలను పొందవచ్చని తెలిపారు. యాసంగి వరి రకాలను జీరో ట్రిల్లేజితో సాగు చేసే మొక్కజొన్న సాగు విధానాలను తెలియజేశారు. ఆర్‌సిఐఆర్ నాగపూర్ శాస్త్రవేత్త సునీల్ మహాజన్ మాట్లాడుతూ అధిక సాంద్రతలో పత్తి సాగు చేసేటప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు శ్రీధర్ సిద్ధి, వెంకట్రాం, ఎల్లంపల్లి వ్యవసాయ అధికారి ప్రేమ్ కుమార్, వివిధ కంపెనీల విత్తన ఉత్పత్తిదారులు, రైతులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

నవతెలంగాణ-మంచిర్యాల



జిల్లా కేంద్రంలోని గణేష్‌నగర్‌లో ఒంటరిగా నివసించే మహిళ అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్టు మంచిర్యాల పట్టణ సీఐ ప్రమోద్‌రావు తెలిపారు. ఆయన వివరాల ప్రకారం..కూస లక్ష్మి(50) ఇంట్లో కూరగాయల వ్యాపారం చేస్తూ నివసించేది. రెండు రోజులుగా ఆమె ఫోన్ లేపకపోవడంతో అనుమానం వచ్చిన లక్ష్మి కుటుంబ సభ్యులు శనివారం సాయంత్రం ఇంటికి వచ్చి తాళం వేసి ఉన్న తలుపులను తెరిచి చూసే సరికి మృతి చెంది ఉంది. దీంతో పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకొని మృతికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. మృతురాలికి భర్త, పిల్లలు ఎవరూ లేరు.

ర్యాలీకి అనుమతినివ్వాలి

నవతెలంగాణ-నిర్మల్‌రూరల్

నిర్మల్ బిల్డింగ్ పెయింటింగ్ కార్మిక సంఘం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో డిసెంబర్ 3న నిర్వహించే ర్యాలీకి అనుమతినివ్వాలని శనివారం నిర్మల్ పట్టణ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ ప్రవీణ్ కుమార్‌ను కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. నిర్మల్ బిల్డింగ్ పెయింటర్‌ల సమస్యలు విన్నవించేందుకు కలెక్టర్ కార్యాలయానికి ర్యాలీగా వెళ్లడానికి అనుమతినివ్వాలని సీఐకి వినతిపత్రాన్ని అందజేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఎస్.విలాస్, రాష్ట్ర కార్యదర్శి భూక్యా రమేష్, జిల్లా ఉపాధ్యక్షులు సాయన్న, యూనియన్ అధ్యక్షులు కుమార్, యూనియన్ కార్యదర్శి ప్రకాష్, యూనియన్ కోశాధికారి నసీర్, ఉపాధ్యక్షులు మసీర్ పాల్గొన్నారు.



బాధిత కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-ఉట్నూర్

మండలంలోని శ్యామ్‌నాయక్ తండాకు చెందిన జాదవ్ బిక్కు, విద్యుత్‌శాఖ కార్మికుడు ఇటీవల మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఉట్నూర్ మాజీ జెడ్పీటీసీ చారులత రాథోడ్ శనివారం వారి కుటుంబాన్ని పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఆమె వెంట నాయకులు, గ్రామస్తులు ఉన్నారు.



లాహూజీ సాల్వే కృషి మరవలేనిది



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సమాజం, దేశం కోసం క్రాంతివీర్ లాహూజీ సాల్వే చేసిన కృషి మరవలేనిదని ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ అనుసరించాలని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. శనివారం లాహుజీ సాల్వే చౌక్‌లో లాహూజీ సాల్వే జయంతిని నిర్వహించారు. దీనికి మాజీ మంత్రి ముఖ్యఅతిథిగా హాజరై సాల్వేతో పాటు అన్నబావుసాఠే చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అంతకు ముందు జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి జోగు రామన్న మాట్లాడుతూ దేశంలోని అన్ని జాతులను ఐక్యం చేసిన మహనీయుడు లాహుజీ సాల్వే అని కొనియాడారు. కులమతాలకు అతీతంగా అన్ని వర్గాల సంక్షేమమం, అభ్యున్నతితో పాటు దేశం కోసం పోరాడారని గుర్తు చేశారు. ఇతర కులాలు, జాతులకు ఆయన ఇచ్చిన సందేశాలను పాటిస్తు ముందుకు సాగాలన్నారు. ప్రతి ఒక్కరూ సాల్వే ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో లాహుజీ శక్తి సేన రాష్ట్ర అధ్యక్షుడు వాసుదేవ్ లాంటిలే, అన్నాబావుసాఠే అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నర్సింగ్ మోరే, రణదివేనగర్, బంగారిగూడ అధ్యక్షులు శ్యాంరావ్, రాజు, తెలంగాణ మతాంగ్ శక్తి జిల్లా అధ్యక్షుడు జాదవ్ సాంబశివ్, ముక్తసాల్వే జిల్లా అధ్యక్షుడు రాజ్ కుమార్, పండరి సూర్యవంశీ, దత్తరాజ్, దేవా కాంబ్లె పాల్గొన్నారు.

ప్రజలకు వసతులు కల్పించాలి



నవతెలంగాణ-బోథ్

విద్యా, వైద్యం, ఉపాధి, ఇల్లు సౌకర్యం కల్పించాలని స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ మల్లేష్‌కు ధర్మ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మండల డీఎస్‌పీ అధ్యక్షుడు కొండమడుగు గణేష్ మాట్లాడుతూ పేద, మధ్యతరగతి వర్గాలు ఎస్సీ, ఎస్టీ, బీసీ ప్రజలు ప్రధానంగా ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ముందు ఐదు డిమాండ్‌లు కేజీ టు పీజీ వరకు నాణ్యమైన ఉచిత విద్యనందించాలన్నారు. అర్హులైన వారందరికీ 200 గజాల స్థలంలో నాలుగు గదుల ఇల్లుని నిర్మించి ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ధర్మ సమాజ్ పార్టీ జిల్లా నాయకులు వెంకటేష్, డీఎస్పీ మండల ఉపాధ్యక్షులు కుందూరు సుధాకర్, ప్రధాన కార్యదర్శి బిక్క రమేష్, కార్యదర్శి రాథోడ్ నరేందర్, రజక సంఘం మండల నాయకులు నరేష్, డ్రైవర్ యూనియన్ అధ్యక్షులు సోలంకి సుభాష్, కుందూరు శ్రీనివాస్, నక్క రాజశేఖర్, బజార్‌హత్నూర్ డీఎస్పీ అధ్యక్షులు నరేష్, రాకేష్, ఇచ్చోడ మండల డీఎస్పీ లక్ష్మణ్, శ్రీనివాస్, స్వామి, బిక్క రాకేష్ ,దినేష్, సంజయ్ పాల్గొన్నారు.

ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలి



నవతెలంగాణ-నిర్మల్

ఏఐటీయూసీ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ అసోసియేషన్ సమావేశం శనివారం సోన్‌లో నిర్వహించారు. ఈ సమావేశానికి ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి విలాస్ ముఖ్యఅతిథిగా హాజరై కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. ఉద్యోగ విరమణ చేసిన అంగన్‌వాడీలకు ప్రభుత్వం రూ.2లక్షలు, ఆయాలకు రూ.లక్ష ఇవ్వాలని, వేతనాలు రూ.18వేలకు పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

హరిహర క్షేత్రంలో నిత్యాన్నదానం

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

నిర్మల్ పట్టణంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన హరిహర క్షేత్రంలో డిసెంబర్ 1న ఆదివారం నుంచి ఆలయ ధర్మకర్తలు అల్లోల వినోదమ్మ మురళీధర్‌రెడ్డి దంపతుల సహకారంతో అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్టు ఆలయ కోశాధికారి వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. వచ్చే జనవరి 13వ తేదీ వరకు ప్రతిరోజు క్షేత్రానికి విచ్చేసే ప్రతి అయ్యప్ప స్వామికి అన్న ప్రసాద వితరణ కార్యక్రమం ఉంటుందన్నారు. ఆలయ గురుస్వామి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి భక్తులు ఎవరైనా విరాళాలు సమర్పించవచ్చునని, ఇండ్లల్లో బిక్ష పెట్టలేని వారు ఇక్కడ పెట్టుకోవచ్చునని తెలిపారు.

డిగ్రీ పరీక్ష కేంద్రం తనిఖీ

నవతెలంగాణ-బేల

మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న కాకతీయ యూనివర్సిటీ డిగ్రీ సెమిస్టర్ పరీక్షా కేంద్రాన్ని శనివారం తహసీల్దార్ రఘునాథ్‌రావు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పరీక్షా కేంద్రంలోని గదుల్లోకి వెళ్లి పరిశీలించారు. పరీక్ష కేంద్రం వద్ద 144 సెక్షన్ అమల్లో ఉందని, విద్యార్థులు ఎవరు మాస్ కాపీయింగ్‌కు పాల్పడకుండా చర్యలు తీసుకోవడం జరిగిందని అన్నారు. జిల్లా కలెక్టర్ రాజర్షిషా ఆదేశానుసారం మండల కేంద్రంలో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఆయన వెంట సీఎస్ కళ్లెం నరేందర్, ఆర్ఐ అశోక్ సిబ్బంది ఉన్నారు.

బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి



నవతెలంగాణ-ఉట్నూర్

అటవీశాఖ అధికారుల నిర్లక్ష్యంతో పులిదాడిలో యువతి మృతి చెందిందనీ, యువతీ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకొని, రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా, ఒక ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని, ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ సిడాం జంగుదేవ్ అన్నారు. శనివారం మండలంలోని ఐటీడీఏ ఆవరణలో ఆయన మాట్లాడుతూ అటవీ అధికారులు నిర్లక్ష్యంతోనే పులిదాడికి యువతి బలైయిందని అన్నారు. కాగజ్‌నగర్ మండలంలోని బెంగాల్ టైగర్-06 నెంబర్‌లో శుక్రవారం గ్రామంలో పత్తి ఏరడానికి వెళ్లిన మోర్ల లక్ష్మి యువతిని పులి దాడిచేసి చంపివేయడం దారుణమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జంతువుల రక్షణ పేరుతో వేల, కోట్ల రూపాయలు వెచ్చిస్తూ అమాయక ఆదివాసీ ప్రజలను చంపేస్తున్నారనీ మండిపడ్డారు. అటవీ జంతువులు ఊర్లోకి వచ్చి ప్రజలపైన, సాధు జంతువుల పైన దాడి చేసి, ప్రాణాలు తీస్తుంటే అటవీ అధికారులు పటిష్టమైన చర్యలు తీసుకోవడం లేదని అన్నారు. ఈ ఘటనలు ప్రతి సంవత్సరం పునరావృతం అవుతున్నాయని అన్నారు. సిర్పూర్ నియోజకవర్గంలోనే పులులు, ఏనుగులు మనుషుల ప్రాణాలు తీయడం దురదృష్టకరమన్నారు. విధులను నిర్లక్ష్యం చేస్తూ ప్రజలకు సమాచారం ఇవ్వకుండా నిండు ప్రాణాలను బలి తీసుకున్న అటవీ అధికారులపై తగు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కవ్వాల్ టైగర్ జోన్ పేరుతో అమాయకులైన ఆదివాసులపై, రైతులపై పులి తీవ్రంగా దాడి చేస్తున్నప్పటికు పులిని ఎప్పుడు ఫారెస్ట్ అధికారులు బంధించలేదని అన్నారు. పులి పేరుతో భయభ్రాంతులకు గురిచేసి ఆదివాసులను అడవి నుంచి గెంటి వేసి, అడవి సంపదను దోచుకోవడానికే అని అన్నారు. అవులు, దూడలు, పశువుల కాపరులు, పంటచేన్లలో కూలీలకు రక్షణ కల్పించాలని ఆదివాసీ విద్యార్థి సంఘం డిమాండ్ చేస్తుందన్నారు. యువతి మృతికి ఫారెస్ట్ అధికారులు బాధ్యత వహించాలన్నారు. విధులలో నిర్లక్ష్యం వహించిన కాగజ్‌నగర్ రేంజ్, గన్నారం బీట్ అధికారులను విధుల నుంచి వెంటనే తొలగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ విద్యార్థి సంఘం నాయకులు పెందూర్ మోతీరాం, జిల్లా కోకన్వీనర్ పెందూర్ జనార్దన్, జంగుపటేల్, భీంరావు, రావి, జుగదిరావు, అర్జున్ పాల్గొన్నారు.

పట్టణాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తాం

- ముున్సిపల్ చైర్మెన్ రాజురా సత్యం



నవతెలంగాణ-ఖానాపూర్

ఖానాపూర్ పట్టణాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తామని మున్సిపల్ చైర్మెన్ రాజురా సత్యం అన్నారు. శనివారం ఖానాపూర్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చైర్మెన్ మాట్లాడారు. ఖానాపూర్ పట్టణంలో జరుగుతున్న పారిశుధ్య పనులకు అవసరమైన బ్లీచింగ్ పౌడర్ ఇతర సామాగ్రి, ఖానాపూర్ పట్టణంలో ఉన్న వాటర్ ట్యాంకులను శుభ్రం చేయుట గురించి వివరించారు. పట్టణంలో ఉన్న కోతుల బెడద తొలగించడానికి పట్టణంలో ఉన్నటువంటి హాస్టల్స్, హోటల్స్ పారబోసిన కూరగాయలు, పండ్లు, ఇతర ఆహార పదార్థాలను పారిశుధ్య వాహనంలో తీసుకువెళ్లి అడవి ప్రాంతంలో వేయడం ద్వారా కోతులు అక్కడికి చేరుకొని ఆహారం తిన్న తర్వాత వాటికి తాగు నీటి ఏర్పాటు చేసి కోతులు మళ్లీ పట్టణంలోకి రాకుండా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. మున్సిపాలిటీలో ఉన్నటువంటి పలు సమస్యలపై దృష్టి సారిస్తామని కౌన్సిల్ సభ్యులు కలిసి తీర్మానం చేశారు. ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ సహకారంతో ఖానాపూర్ పట్టణాన్ని మరింత అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మెన్ కావలి సంతోష్, కౌన్సిలర్స్ జన్నారపు విజయలక్ష్మి శంకర్, నాయిని స్రవంతి సంతోష్, పరిమి లత సురేష్, కిషోర్ నాయక్, కుర్మా శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ మనోహర్, మున్సిపాలిటీ అధికారులు పాల్గొన్నారు.

అబుల్ కలాం విగ్రహ ఏర్పాటు పనులు ఆపినందుకు నిరసన....

మౌలానా అబుల్ కలాం ఆజాద్ విగ్రహ ఏర్పాటు పనులు ఆపి అవమానించినందుకు నిరసనగా శనివారం మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సాధారణ కౌన్సిల్ సర్వసభ్య సమావేశాన్ని నలుగురు కౌన్సిలర్లు బహిష్కరించి, బయటికి వెళ్లిపోయారు. ఈ సందర్భంగా కౌన్సిలర్‌లు అబ్దుల్ ఖలీల్, ఆఫ్రిన్ బేగం, అమనుల్లా ఖాన్, కారింగుల సంకీర్తన, సుమన్, పాజియ బేగం, షబ్బీర్ పాష మాట్లాడారు. మున్సిపల్ పాలకవర్గం తీర్మానం చేసిన దానికి అనుగుణంగా అబుల్ కలాం ఆజాద్ విగ్రహ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఒక స్వాతంత్ర్య సమర యోధుడు, భారత రత్న విగ్రహ ఏర్పాటు పనులు మున్సిపల్ అధికారులు బలవంతంగా ఆపడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. అబుల్ కలామ్ ఆజాద్ అందరివాడని దీని వల్ల మనోభావాలు దెబ్బతింటాయని అన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా ఈ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. శాంతియుతంగా నిరసన కార్యక్రమాలు చేస్తామని అన్నారు. ఈ విషయమై కలెక్టర్‌ను సంప్రదిస్తామని అన్నారు.

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని, ఆ దిశగా వారిని ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బీసీ వసతి గృహ విద్యార్థుల జిల్లా స్థాయి క్రీడ పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. శనివారం క్రీడా పోటీలకు అదనపు కలెక్టర్ శ్యామలదేవితో కలిసి కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా క్రీడాకారులను పరిచయం చేసుకుంటూ జట్ల మధ్య టాస్ వేసి పోటీలను ప్రారంభించారు. అనంతరం ఆయన కూడా పలు క్రీడలు ఆడి విద్యార్థులను ప్రోత్సహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజర్షిషా మాట్లాడుతూ గతంలో కేవలం రెసిడెన్షియల్ పాఠశాలల్లోనే క్రీడ పోటీలు జరిగేవన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు బీసీ వెల్ఫర్ వసతి గృహాల్లో కూడా క్రీడ పోటీలు నిర్వహించడం సంతోషకరమన్నారు. ఈ పోటీలతో విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలతో పాటు క్రమశిక్షణ, పోటీ తత్వం పెరుగుతుందన్నారు. దీని ద్వారా వీరు భవిష్యత్తులో రాణించే అవకాశాలుంటాయన్నారు. అదే విధంగా ప్రభుత్వం ఇటీవల డైట్ చార్జీలను పెంచడం పట్ల విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. వసతి గృహాలను తనిఖీ చేసిన సమయంలో విద్యార్థులో సంతోషిస్తు ధన్యవాదాలు తెలుపుతున్నారన్నారు. విద్యార్థులకు మంచి భోజనం అందించేందుకు గాను ప్రభుత్వం ఫుడ్ సెఫ్టి కమిటీలను ఆయా విద్యా సంస్థల్లో నియమించిందన్నారు. త్వరలో వంట మనిషితో పాటు నర్సు, ఉపాధ్యాయులకు ఆహార భద్రత అధికారులతో శిక్షణాలు ఇస్తామన్నారు. రుచి, పరిశుభ్ర ఆహారం ఎలా అందించాలో వివరిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ వెల్ఫర్ అధికారి రాజలింగు, డీవైఎస్ఓ వెంకటేశ్వర్లు, వసతి గృహాల పీఈటీలు, పీడీలు, కోచ్‌లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిర్మల్ : చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని మున్సిపల్ చైర్మెన్ గండ్రత్ ఈశ్వర్, డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో ట్రస్మా ఆధ్వర్యంలో ట్రస్మా గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్-2024 ప్రారంభమయ్యాయి. కార్యక్రమంలో ముందుగా జ్యోతిప్రజ్వలన చేసి పతాకావిష్కరణ చేశారు. అనంతరం క్రీడాకారులు గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం వారు మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. క్రీడ రంగంలో రాణించడం వల్ల భవిష్యత్తులో ఉన్నత విద్య, ఉద్యోగాల్లో క్రీడా కోట చాలా ఉపయోగపడుతుందన్నారు. క్రీడల వల్ల విద్యార్థిని, విద్యార్థులు మానసిక ఉల్లాసంతో పాటు శారీరక ధృడత్వం పెంపొందుతుందన్నారు. దీంతో ఆరోగ్యవంతంగా ఉంటారని, ఒత్తిడి తగ్గుతుందని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ట్రస్మా అధ్యక్షులు వెంకటేశ్వరరావు, కౌన్సిలర్ అన్వర్ పాషా, మాజీ కౌన్సిలర్ పతికే శ్రీనివాస్, నాయకులు కొంతం గణేష్, మారుతి, ప్రయివేట్ స్కూల్స్ ప్రిన్సిపల్స్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఆధ్వర్యంలో గురుకుల బాట

నవతెలంగాణ-నేరడిగొండ

గురుకుల బాట పట్టాలన్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు ఎమ్మెల్యే అనిల్ జాదవ్ శనివారం మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో వంట గదిని పరిశీలించి, విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. ఆహారం విషయంలో అధికారులందరూ సీరియస్‌గా ఉండాలని ఏ మాత్రం నాణ్యత తగ్గిన సహించేదిలేదని అన్నారు. ప్రధాన అంశంగా గురుకుల విద్యార్థులు ఫుడ్ పాయిజన్ వల్ల చనిపోతున్న దృష్ట్యా బీఆర్ఎస్ నాయకులు రాష్ట్రంలో ఉన్న అన్ని గురుకులాల్లో గురుకుల బాట చేపడుతున్నారని అన్నారు. గురుకుల పాఠశాలలో కనీసం ఆహారం సైతం నాణ్యతగా అందించట్లేదని గురుకుల బాట చేపట్టడం జరిగిందని అన్నారు. రాష్ట్రంలో అసమర్థ ప్రభుత్వం ఉన్నందున 11 నెలల్లో మొత్తం 52 మంది విద్యార్థులు చనిపోయారని అన్నారు. ఇందులో 38 మంది ఫుడ్ ఫాయిజన్ వల్ల చనిపోయారని అన్నారు. చలి తీవ్రత ఎక్కువగా ఉండటం అందుకే బీఆర్ఎస్ గురుకుల బాటలో భాగంగా తన సొంత డబ్బులతో పిల్లలకు దుప్పట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో పలు మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



విద్యార్థులకు రుచికరమైన ఆహారం అందించాలి

- ప్రత్యేకాధికారి బాలిగ్ అహ్మద్



నవతెలంగాణ-సారంగాపూర్

విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలని మండల ప్రత్యేకాధికారి బాలిగ్ అహ్మద్ అన్నారు. శనివారం మండలంలోని గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులతో మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో సమావేశం నిర్వహించి మాట్లాడారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన నిర్వహణపై మాట్లాడారు. విద్యార్థులకు రుచిశుచిలతో కూడిన నాణ్యమైన భోజనం అందించాలని అన్నారు. ఉపాధ్యాయులతో విద్యార్థులతో భద్రతా కమిటీలు ఏర్పాటు చేయాలని అన్నారు. కమిటీ సభ్యులు మధ్యాహ్న భోజనంపై దృష్టి సాధించి, నాణ్యమైన బియ్యం తాజా కూరగాయలు పరిశుభ్రమైన వాతావరణంలో మధ్యాహ్న భోజనం విద్యార్థులకు అందించేలా పర్యవేక్షించాలని ప్రధానోపాధ్యాయులకు వివరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీదేవి, ఎంపీడీఓ లక్ష్మీకాంతరావు, ఎంఈఓ మధుసూదన్, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు దశరథ్, సాయన్న పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



నవతెలంగాణ-నేరడిగొండ

మండలంలోని బుద్దికొండ గ్రామానికి చెందిన ఎ.సౌజన్యకు మంజూరైన రూ.24వేల విలువగల సీఎంఆర్ఎఫ్ చెక్కును శనివారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ దేవేందర్‌రెడ్డి, సునితారెడ్డి ఉన్నారు.

సత్యసాయి సేవా ఆధ్వర్యంలో బ్లాంకెట్ల పంపిణీ



నవతెలంగాణ-ఖానాపూర్

మండలంలోని సింగపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని గోండు గూడెం గ్రామంలో శనివారం సత్యసాయి సేవ బృందం ఆధ్వర్యంలో 65 మంది నిరుపేద ప్రజలకు బ్లాంకెట్లను అందజేశారు. ఈ సందర్భంగా సత్యసాయి సేవా నిర్మల్ జిల్లా అధ్యక్షులు భీమ్‌సేన్ మాట్లాడుతూ చలికాలాన్ని దృష్టిలో ఉంచుకొని నిరుపేదలకు బ్లాంకెట్లను అందజేసినట్టు తెలిపారు. అనంతరం రాజుర గ్రామంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో నాలుగు మండలాలకు చెందిన పదో తరగతి విద్యార్థిని విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోటీలలో గెలుపొందిన విద్యార్థి విద్యార్థులకు బహుమతులను సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి బృందం సభ్యులు పి.సుజాత, హరిచంద్‌రెడ్డి, చిక్యాల రత్నాకర్‌రావు, రిటైర్డ్ ప్రధాన ఉపాధ్యాయులు సత్తయ్య, గోసంపల్లి కన్వీనర్ రాజేశ్వర్, మాజీ సర్పంచ్ చిన్నం పెద్దన్న, రామకృష్ణ, రవి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సునీల్ రెడ్డి, పటేల్ అర్జున్, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రక్తం ఇచ్చి మరొక ప్రాణాన్ని కాపాడాలి

నవతెలంగాణ-ఉట్నూర్

రక్తం ఇచ్చి మరొక ప్రాణాన్ని కాపాడాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శనివారం మండలంలోని వంకతుమ్మ గ్రామంలో బిగ్‌టీవీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరానికి ముఖ్యఅతిథిగా హజరై రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో ఎమ్మెల్యే హెల్త్ చెకప్ చేసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారిని రక్తం ఇచ్చి మరొక ప్రాణాన్ని కాపాడాలని కోరారు. మన వంతు మనం ఒక్కరికి సహాయం చేసినవాళ్లమవుతామన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు డీఎంహెచ్ఓ డాక్టర్ మనోహర్, నాయకులు, కార్యకర్తలు, రక్తదాతలు, గ్రామప్రజలు పాల్గొన్నారు.

రేపటి నుంచి కుష్టు వ్యాధిగ్రస్తుల సర్వే

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

డిసెంబర్ 2 నుంచి 15వ తేది వరకు కుష్టు వ్యాధిగ్రస్తుల సర్వేను నిర్వహిస్తున్నట్టు డీఎంహెచ్ఓ డాక్టర్ నరేందర్ రాథోడ్ తెలిపారు. శనివారం డీఎంహెచ్ఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సర్వే వివరాలను వెల్లడించారు. జిల్లాలోని 22 పీహెచ్‌సీలు, 5 అర్బన్ హెల్త్ సెంటర్ల పరిధిలో సర్వే కొనసాగుతుందన్నారు. జిల్లాలో ప్రస్తుతం 54 కేసులు యాక్టివ్‌గా ఉన్నాయన్నారు. కుష్టు వ్యాధిని ప్రారంభ దశలో గుర్తిస్తే త్వరగా నయం చేయొచ్చని తెలిపారు. శరీరంపై పాలిపోయిన రాగి రంగులో మొద్దుబారిన మచ్చలు ఉంటే కుష్టుగా అనుమానించాలన్నారు. డిసెంబర్ 2 నుంచి ఇంటికి వచ్చే సర్వే బృందాలకు పూర్తి సమాచారం ఇవ్వాలని కోరారు. కుష్టు రహిత జిల్లాను తయారు చేయడంలో ప్రజలు సహకారం అందించాలన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కుమురంభీం ఆసిఫాబాద్
ఆదివారం | డిసెంబర్ 01, 2024 | www.navatelangana.com

ఘనంగా ప్రజా పాలన ఉత్సవాలు



నవతెలంగాణ-వాంకిడి

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీల ప్రజా సంక్షేమ పథకాల ప్రజా పాలన ఉత్సవాలు సాంస్కృతిక కళా యాత్ర కార్యక్రమాన్ని ఎంపీడీఓ వి ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో శనివారం మండలకేంద్రంతో బెండారా, కమాన గ్రామ పంచాయతీలలో కళాకారుల కళాజాత నిర్వహించారు. అభివృద్ధి కార్యక్రమాలపై ప్రదర్శనలు నిర్వహించారు. తహసీల్దార్ రియాజ్ హైమద్ హాజరై రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు పరుస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాకారులు గొడిసెల బాపు, పవార్ మోహన్ నాయక్, కొదాది సోమశేఖర్, మరప పురుషోత్తం, కొప్పర్తి సురేందర్, గుండ శిరీష, బొమ్మగోని వెన్నెల, కుమ్మరి శ్రావణ్‌కుమార్, గొల్లపల్లి శిరీష, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ల అప్పగింత

నవతెలంగాణ-కాగజ్‌నగర్



పట్టణంలో ఇద్దరు తమ సెల్‌ఫోన్‌లను పోగొట్టుకోగా వాటిని పోలీసులు కనుక్కొని తిరిగి బాధితులకు అప్పగించారు. పట్టణంలోని బాలాజీనగర్‌కు చెందిన కొండపర్తి శ్రీనివాస్, చింతలమానెపల్లి మండలం బాలాజీ అనుకోడకు చెందిన తాళ్లపల్లి జయవర్ధన్‌లు కొన్ని రోజుల క్రితం కాగజ్‌నగర్‌లో తమ సెల్‌ఫోన్‌లను పోగొట్టుకున్నారు. అప్పట్లో పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఆ ఫోన్‌లను కనుక్కొని శనివారం టౌన్ సీఐ రాజేంద్రప్రసాద్, ఎస్ఐ సుధాకర్ బాధితులకు అప్పగించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎవరైనా ఫోన్ పోగొట్టుకున్నా, దొంగిలించబడిన వెంటనే దగ్గరలోని పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని, సీఈఐఆర్ పోర్టల్ ద్వారా సెల్‌ఫోన్‌లు దొరికే అవకాశం ఉంటుందని తెలిపారు.

కేస్లాపూర్ ఆలయంలో కలెక్టర్ ప్రత్యేక పూజలు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

తన జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని కేస్లాపూర్ అంజనేయస్వామి ఆలయంలో కలెక్టర్ వెంకటేష్ దోత్రే దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు శిరీష్ శర్మ, నరేష్ శర్మ, శేఖర్ శర్మల ఆధ్వర్యంలో పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు ధర్మపురి వెంకటేశ్వర్లు, కార్యదర్శి గుండా వెంకన్న, కోశాధికారి పిన్న వివేక్, ఉపాధ్యక్షులు డాక్టర్ రమేష్, కమిటీ ప్రముఖులు ఎకరాల శ్రీనివాస్, డాక్టర్ మధు, గడ్డల వెంకన్న, నారాయణమూర్తి, సుధాకర్, నర్సింహమూర్తి, హరి, కృపాల్, అర్చకులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు పలువురి శుభాకాంక్షలు

కలెక్టర్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని ఆయనకు పలువురు పుష్పగుచ్ఛమిచ్చి శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే కోవలక్ష్మి, కాగజ్ నగర్ కాంగ్రెస్ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్, మాజీ జడ్పీటీసీ అరిగెల నాగేశ్వరరావు, ఆసిఫాబాద్ సింగిల్ విండో చైర్మన్ అలీ బిన్ అహ్మద్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవీందర్ నాయకులు పాల్గొన్నారు.

అడవులను సంరక్షించడం అందరి బాధ్యత

నవతెలంగాణ-కెరమెరి

అడవులను సంరక్షించడం అందరి బాధ్యత అని దనోరా సెక్షన్ అధికారి మల్లయ్య అన్నారు. శనివారం సెక్షన్ పరిధిలోని ధనోర, శివగూడ, సుర్దాపూర్ గ్రామాల్లో బీట్ అధికారిని స్వప్నతో కలిసి ప్రజలకు 'అడవికి నిప్పు పర్యావరణ ముప్పు' అటవీ జంతువుల సంరక్షణపై అవగాహన కల్పించి పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ గిరిజనులకు గతంలో ఇచ్చిన ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలు ఉన్నంత వరకు మాత్రమే భూమి సాగు చేసుకోవాలని తెలిపారు. ఎక్కువగా సాగు చేస్తే పీడీ చట్టం కింద కేసు నమోదు చేయాల్సివస్తుందని తెలిపారు. అలాగే అడవిలో దొరికే ఇప్పపువ్వు ఇతర పండ్ల సేకరణ ద్వారా ఆర్థికంగా ఎదగాలని సూచించారు. అటవీ సంరక్షణలో గ్రామస్తులు తమకు సహకరించాలని కోరారు. అక్రమ కలప తరలించకుండా ఎప్పటికప్పుడు పటిష్టమైన చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. ఎవరైనా అక్రమంగా కలప తరలిస్తే అటవీ అధికారులకు తెలియజేయాలన్నారు. అటవీ ప్రాంతంలో నిప్పు పెట్టకూడదని అది పర్యావరణానికి ముప్పు కలిగిస్తుందన్నారు. అటవీ జంతువుల సంరక్షణ వల్ల పర్యావరణ సమతుల్యం సాధ్యమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అనిమల్ ట్రాకర్ దేవరావు, గ్రామస్తులు ఆత్రం రాము, సిడాం రాజు, మారుతి పాల్గొన్నారు.

విదేశీ విద్యా పథకానికి దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

2024 విద్యా సంవత్సరానికి గాను తెలంగాణ రాష్ట్ర మైనార్టీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో విదేశాలలో ఉన్నత విద్య అభ్యసించాలనుకునే అర్హత గల మైనార్టీ విద్యార్థులు (ముస్లిం, క్రైస్తవులు, సిక్కులు, జైనులు, బౌద్ధులు, పార్సీలు) ముఖ్యమంత్రి విదేశీ విద్యా పథకంకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి ఆర్.రమాదేవి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విదేశీ విద్యాలయాలలో 2024 సంవత్సరం ప్రవేశాలకు సంబంధించి పోస్ట్ గ్రాడ్యుయేషన్‌కు డిగ్రీ(ఇంజనీరింగ్)లో 60 శాతం మార్కులు, పీహెచ్‌డీకి, పీజీలో 60 శాతం మార్కులు కలిగి ఉండాలని, అమెరికా, కెనడా, బ్రిటన్, ఆస్ట్రేలియా, ఫ్రాన్స్, జర్మనీ, జపాన్, సింగపూర్, సౌత్ కొరియా, న్యూజిలాండ్ దేశాలలోని విశ్వవిద్యాలయాలలో అన్ని అర్హత ప్రమాణాలు నెరవేర్చి ఆగస్టు 1, 2024 నుండి డిసెంబర్ 31, 2024 మధ్య కాలంలో అడ్మిషన్స్ పొందిన విద్యార్థులు అర్హులని, ఆన్‌లైన్‌లో తెలంగాణఈపాస్.సీజీజీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా డిసెంబర్ 1వ తేదీ నుండి 31వ తేదీ సాయంత్రం 5 లోపు సంబంధిత ధ్రువపత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని, జనవరి 20 లోగా దరఖాస్తు ప్రతులను జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ కార్యాలయంలో సమర్పించాలని, అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

నేడు పాఠశాలల్లో ప్రజా పాలన విజయోత్సవాలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రజా పాలన విజయోత్సవంలో భాగంగా నేడు పాఠశాలల్లో ప్రభుత్వం చేసిన అభివృద్ధికి గుర్తుగా విజయోత్సవ వేడుకలు నిర్వహించాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని 739 పాఠశాలల్లో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి జిల్లాలోని 446 పాఠశాలల్లో రూ.17 కోట్ల 74 లక్షల నిధులతో పనులు చివరి దశకు వచ్చాయని, కేజీబీవీలో ఒప్పంద ప్రాతిపదికన 28 పోస్టులు భర్తీ చేసినట్లు, నాన్ టీచింగ్ సిబ్బంది కోసం నోటిఫికేషన్ జారీ చేశామని తెలిపారు.

ఎమ్మెల్యేను కలిసిన 317 జీవో బాధితులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

గత ప్రభుత్వం జారీ చేసిన 317 జీవోతో స్థానికతను కోల్పోయే ప్రమాదం ఉండడంతో దాన్ని రద్దు చేసే విధంగా రానున్న అసెంబ్లీ సమావేశాలు ప్రస్తావించాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మిని 317 జీవో బాధితులు రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాలలో జీవో రద్దుపై మాట్లాడాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్పందిస్తూ గతంలో తమ ప్రభుత్వం 317 జీవో తీసుకువచ్చినప్పుడు ప్రతిపక్షంలో ఉన్న ప్రస్తుత ప్రభుత్వ పెద్దలు విమర్శించారని, సంవత్సరం పూర్తయినప్పటికీ ఇంకా సమస్య పరిష్కరించకపోవడం పట్ల వారికి ఉన్న చిత్తశుద్ధి అర్థమవుతోందని పేర్కొన్నారు. 317 జీవోతో స్థానికత ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారి సమస్యలు పరిష్కరించే దిశగా తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పృథ్వి, అఖిల్, సంతోష్, హరిచంద్, సంతోష్, రాజలింగు పాల్గొన్నారు.

తిర్యాణిలో ఎస్ఎస్ఏ ఉద్యోగుల నిరసన

నవతెలంగాణ-తిర్యాణి

విద్యాశాఖలో పనిచేస్తున్న సమగ్ర శిక్షా కాంట్రాక్టు ఉద్యోగులు తమను రెగ్యులర్ చేయాలనే డిమాండ్ చేస్తూ శనివారం తిర్యాని మండల విద్యావనరుల కేంద్రం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఎస్ఏ సంఘం తిర్యాని మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కానుగంటి రాజ్ కుమార్, అన్నం రాజేష్‌లు మాట్లాడుతూ తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఎస్ఎస్ఏ రాష్ట్ర సంఘం ఇచ్చిన పిలుపు మేరకు శనివారం నిరసన దీక్ష చేపట్టడం జరుగుతుందన్నారు. విద్య రంగ అభివద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు ఉద్యోగ భద్రత లేకుండా చాలీ చాలని వేతనాలతో ఎన్నో అవస్థలను ఎదుర్కొంటున్నామన్నారు. గత నవంబర్‌లో ఎస్ఎస్ఏ ఉద్యోగులు వరంగల్‌లో నిరసన చేస్తున్న సందర్భంలో అప్పట్లో ప్రతిపక్షంలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తాము అధికారంలోకి వచ్చిన వెంటనే సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని ముఖ్యమంత్రి



ఇచ్చిన హామీని నిలబెట్టుకుని తమకు న్యాయం చేయాలన్నారు. సమగ్ర శిక్షాలో పనిచేస్తున్న తమను రెగ్యులర్ చేయాలని అప్పటి వరకు మినిమం టైం స్కేల్ కల్పించాలని, తదితర డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలన్నారు. లేని పక్షంలో సమ్మెకు వెళ్లక తప్పదన్నారు. కార్యక్రమంలో మండల ఎస్ఎస్ఏ ఉపాధ్యక్షులు పుష్పలత, సహాయ కార్యదర్శి స్వప్న, ఎస్ఎస్ఏ ఉద్యోగులు పాల్గొన్నారు.

అటవీ సంరక్షణ భావితరాలకు రక్షణ

- ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేష్ దోత్రే

నవతెలంగాణ-ఆసిఫాబాద్

అటవీ సంరక్షణ భావితరాలకు రక్షణ లాంటిదని, దాన్ని కాపాడుకొని భావి తరాలను రక్షించుకుందామని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. శనివారం జిల్లా స్థాయి అటవీ రక్షణ కమిటీ సమావేశానికి జిల్లా అటవీ అధికారి నీరజ్ కుమార్, అదనపు ఎస్. పి. ప్రభాకర్ రావు, ఆర్డీవో లోకేశ్వర్ రావుతో కలిసి వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడవుల సంరక్షణ భావి తరాలకు ముఖ్యమని, ప్రతి ఒక్కరు తమ బాధ్యతగా అటవీ సంరక్షణ బాధ్యతగా తీసుకోవాలని తెలిపారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి అడవులను రక్షించాలని, ఆక్రమణ జరగకుండా కాపాడాలని, అక్రమ స్మగ్లింగ్ అరికట్టాలని అన్నారు. విద్యుత్ తీగలను అమర్చి వన్య ప్రాణులకు హాని కలిగించే వారి పట్ల కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. అటవీ ప్రాంతంలో పంటలను కాపాడుకోవడానికి రైతులు విద్యుత్ తీగలను అమర్చడంతో కొన్ని సందర్భాలలో రైతులు, కూలీలకు హాని కలుగుతుందని, నియంత్రణ దిశగా చర్యలు



తీసుకొని రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో పులులు సంచరిస్తున్నందున అప్రమత్తత చర్యలు తీసుకోవాలని, వాటి బారిన ప్రజలు పడకుండా అవగాహన కల్పించాలని తెలిపారు. డిసెంబర్ నుంచి ఏప్రిల్ వరకు అడవిలో ఆకుల వలన మంటలు వ్యాపించి చెట్లు కాలిపోకుండా జాగ్రత్త చర్యలు చేపట్టాలని తెలిపారు. వెదురు మొక్కలను పెంచేందుకు ప్రభుత్వ స్థలాన్ని గుర్తించాలని, పశువుల మేత కొరకు అడవిలో అనువైన స్థలాన్ని గుర్తించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎస్‌పి కరుణాకర్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి దత్తారాం, అదనపు గ్రామీణాభివృద్ధి అధికారి రామకృష్ణ, జిల్లా పశు సంవర్ధక అధికారి సురేష్, తహసీల్దార్లు, ఎఫ్ఆర్ఓలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

కేసుల పరిష్కారంలో నాణ్యత పెంచాలి



- ఎస్పీ డివి శ్రీనివాసరావు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

పోలీస్‌స్టేషన్ల అధికారులు కేసుల పరిష్కారంలో నాణ్యత ప్రమాణాలు పెంచాలని ఎస్పీ డివి శ్రీనివాసరావు తెలిపారు. ఏఆర్ హెడ్ క్వార్టర్స్‌లో జిల్లాలోని పోలీస్ స్టేషన్ల పనితీరుకు సంబంధించిన నెలవారి నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసుల విచారణలో జాప్యం వహిస్తే సహించేది లేదని, నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై క్రమశిక్షణా చర్యలు తప్పవన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. పెండింగ్‌లో ఉన్న కేసుల సత్వర పరిష్కారానికి కృషి చేయాలన్నారు. నేరస్తులకు శిక్ష పడే విధంగా చేసి బాధితులకు న్యాయం చేకూర్చాలని సూచించారు. పెట్రోలింగ్, బ్లూ కోల్ట్ వాహనాలతో అధికారులు, సిబ్బంది ఎల్లప్పుడూ రోడ్లపై తిరుగుతూ ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. జిల్లా వ్యాప్తంగా హాట్ స్పాట్స్‌ను గుర్తించి గంజాయిని రవాణా చేసే వ్యక్తులతో పాటు గంజాయిని సేవించే వారిపై కూడా కేసులు నమోదు చేసి కఠినచర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలోని అన్ని ప్రదేశాలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. ట్రాఫిక్ నియమాలను పాటించకుండా మద్యం సేవించి వాహనాలను నడుపుతూ, ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ రోడ్డు ప్రమాదాలకు కారణమయ్యే వారిపై చట్టపరంగా కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ ఆర్ ప్రభాకర్ రావు, డీఎస్పీలు కరుణాకర్, రామానుజం, కాజా మహిముద్దీన్, జిల్లాలోని సిఐలు, ఎస్సైలు సిబ్బంది పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎంపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రభుత్వం పదేపదే చెబుతున్నా కనీసం మెనూ పాటించని జిల్లాలోని కౌటాల మండలం మొగడ్‌దగడ్ ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయునిపై చర్యలు తీసుకోవాలని డివైఎఫ్ఐ, టిఏజిఎస్, కెవిపిఎస్ నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రేను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటికే కలుషిత ఆహారంతో జిల్లాలో విద్యార్థిని మృతి చెందిందని అయినప్పటికీ ప్రధానోపాధ్యాయులు కళ్లు తెరవడం లేదని తెలిపారు. పాఠశాలల తనిఖీలో భాగంగా మొగడ్‌దగడ్ పాఠశాలను అదనపు కలెక్టర్ దీపక్ తివారి తనిఖీ చేసినప్పుడు కుళ్లిపోయిన కోడిగుడ్లు ఆలుగడ్డలు, పప్పుకు బదులు నీళ్లచారు కనిపించడం నిర్లక్ష్యానికి నిదర్శనమని తెలిపారు. అధికారిపై చర్యలు తీసుకుంటేనే మిగతా వారిలో మార్పు వస్తుందని, అధికారులు అలసత్వం



వహిస్తే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. అనంతరం కలెక్టర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గోడిసెల కార్తీక్, తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం జిల్లా అధ్యక్షురాలు కొరెంగ మాలశ్రీ, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్, సిఐటియు జిల్లా అధ్యక్షుడు రాజేందర్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఎస్ఎస్ఏ ఉద్యోగుల ఆందోళన

సిర్పూర్(టి) : తమ సమస్యలు పరిష్కరించాలని సర్వ శిక్ష అభియాన్ కాంట్రాక్టు ఉద్యోగుల ధర్నా ఎమ్మార్సీఎస్ ముందు కొనసాగుతోంది. శనివారం రెండో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా సంఘం నాయకుడు పవన్ మాట్లాడుతూ గతంలో వరంగల్ జిల్లా కేంద్రంలో చేస్తున్న దీక్ష శిబిరాన్ని అప్పటి టీపీసీసీ హోదాలో వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి పార్టీ అధికారం చేపట్టిన అనంతరం సమస్యను నెలలోనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. అధికారం చేపట్టి 11 నెలలు కావస్తున్న సమస్యలను పరిష్కరించడంలో ముందుకు రాకపోవడం బాధాకరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీలు రాజేష్, రమేష్, సంతోష్, ప్రశాంత్, ప్రకాష్, కేజీబీవీ ఎస్ఓ నాగసుధ పాల్గొన్నారు.



పులులను తరలించడంలో అటవీ శాఖ వైఫల్యం



నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ అటవీ డివిజన్‌లో సంచరిస్తున్న పెద్దపులులను ఇక్కడి నుండి తరలించడంలో అటవీ శాఖ పూర్తిగా వైఫల్యం చెందిందని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి కూశన రాజన్న, నాయకులు ముంజం ఆనంద్‌కుమార్, సిహెచ్ సాయికృష్ణ, వి సాయి విమర్శించారు. పులి దాడిలో గాయపడ్డ సురేష్‌ను శనివారం కాగజ్‌నగర్‌లోని ఆసుపత్రిలో పరామర్శించిన అనంతరం వారు విలేకరులతో మాట్లాడారు. పులుల ప్రాణాలకిస్తున్న విలువ మనుష్యుల ప్రాణాలకు ఇవ్వడం లేదని అన్నారు. 24 గంటల వ్యవధిలో ఒక మహిళ ప్రాణాలను తీసిందని, మరో రైతును తీవ్రంగా గాయపర్చిందని అన్నారు. వెంటనే ఈ పులిని బంధించి సంరక్షణ ప్రాంతానికి తరలించాలని డిమాండ్ చేశారు. పులి దాడిలో గాయపడ్డ సురేష్‌కు మెరుగైన వైద్యం అటవీ శాఖే అందించాలని అన్నారు.

పులి బారి నుండి ప్రజలను రక్షించాలి

కాగజ్‌నగర్ అటవీ డివిజన్‌లో సంచరిస్తున్న పులి బారి నుండి ప్రజలను రక్షించాలని తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి మార్త సత్యనారాయణ, సభ్యులు రమణయ్య, నారాయణ, మూర్తి, నర్సయ్య ఒక ప్రకటనలో కోరారు. డివిజన్‌లో సంచరిస్తున్న పులిని వెంటనే బంధించి సురక్షిత ప్రాంతానికి తరలించాలని సూచించారు. ఇప్పటికే ఇద్దరిపై పులి దాడి చేసిందనీ, దీనితో గ్రామీణ ప్రాంత రైతులు భయాందోళనకు గురవుతున్నారని అన్నారు.

అంకిత భావంతో పనిచేయాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

సమాజంలో పోలీస్ వృత్తి ఎంతో అత్యున్నతమైనదని దానికి విలువ పెరిగేలా విధుల పట్ల అంకిత భావంతో పని చేయాలని ఎస్పీ డివి శ్రీనివాసరావు తెలిపారు. రాష్ట్ర పోలీస్ శాఖ ద్వారా జిల్లాలో కానిస్టేబుల్ ఉద్యోగం సంపాదించి శిక్షణ పూర్తి చేసుకుని జిల్లాలో విధుల్లో చేరుతున్న 151 మంది సిబ్బందికి అదనపు ఎస్పీ ప్రభాకర్‌రావుతో కలిసి పలు సూచనలు చేశారు. సమాజం పట్ల విశ్వసనీయత పెంపొందించేలా ప్రజా సేవకు అంకితం కావాలన్నారు. ప్రతిరోజు కొత్తదనంతో విధులు నిర్వహించాలన్నారు. దృఢ చిత్తంతో ఉండి ఉద్యోగం చేయాలని, ప్రతిరోజు వ్యాయామం చేయడం అలవాటు చేసుకోవాలన్నారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే వారిపట్ల మర్యాదగా ప్రవర్తించాలన్నారు. విధుల పట్ల నిబద్ధతతో వ్యవహరించి జిల్లాకు, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. అనంతరం సివిల్ కానిస్టేబుల్స్‌కు కేటాయించిన పోలీస్ స్టేషన్‌కు సంబంధించిన తాత్కాలిక పోస్టింగ్ ఆర్డర్లు అందించారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీలు కరుణాకర్, రామానుజం, ఖాజామొహీనుద్దీన్, ఎస్బి సిఐ రాణాప్రతాప్, ఆర్ఐ పెద్దయ్య, ఏఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.

కేజీబీవీని తనిఖీ చేసిన ఎంపీడీఓ



నవతెలంగాణ-కౌటాల

కేజీబీవీ బాలికల పాఠశాలను శనివారం ఎంపీడీఓ కోట ప్రసాద్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశానుసారం, పాఠశాల తనిఖీ చేసి. స్టోర్ రూంలో కూరగాయలు తాజాదనం కోల్పోయినవి గమనించారు. ఏజెన్సీ వారు మూడు రోజులకు ఒకసారి సరఫరా చేస్తున్నారని కేజీబీవీ ప్రత్యేక అధికారి పవిత్ర తెలిపారు. ప్రతి రోజూ తాజా కూరగాయలు సరఫరా అయ్యే విధంగా ఆదేశాలు జారీ చేయుటకు జిల్లా అధికారులకు నివేదిక సమర్పిస్తామని అన్నారు. ఏఎన్ఎం విజయలక్ష్మి గైర్హాజరు కావడంతో చరవాణి ద్వారా మందలించారు. తరగతి గదులు, వంటగది, స్నానాల గదులు, పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వంట దినుసులు ఎప్పటికప్పుడు శుభ్రపరిచి విద్యార్థులకు పౌష్టికాహారం అందించే విధంగా చూసుకోవాలని ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. ఆయనతో పాటు ఎస్ఓ పవిత్ర, కార్యదర్శి సాయి కృష్ణ ఉన్నారు.

చెడు అలవాట్లే నేరానికి కారణం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

తాత్కాలికంగా ఆనందాన్ని ఇచ్చే చెడు అలవాట్లు ప్రస్తుత పరిస్థితుల్లో నేరాలకు మూల కారణమవుతున్నాయని జిల్లా సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కన్వీనర్ యువరాజ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ప్రత్యేక సబ్ జైల్‌లో ఖైదీలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరాలు జరగడంలో ముఖ్యమైన పాత్ర చెడు అలవాటులైన మద్యం, మాదకద్రవ్యాలు పోషిస్తున్నాయన్నారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండి నేర ప్రవృత్తిని తగ్గించుకోవాలన్నారు. ప్రవర్తనలో మార్పు వచ్చి కేసు కొట్టి వేయించుకోవాలని ఆలోచన వచ్చినవారు, తెలిసో తెలియకో క్షణికావేశంలో తప్పులు చేసి జైలులో ఉన్నవారు న్యాయవాదిని నియమించుకునే స్తోమత లేనివారు న్యాయ సేవాధికార సంస్థ నుండి ఉచిత న్యాయ సహాయాన్ని పొందవచ్చని తెలిపారు. ఖైదీల ఆరోగ్య పరిస్థితులపై ప్రత్యేక దృష్టి సారించాలని, వైద్య సేవలు అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి అనంతలక్ష్మి, జైలు సూపరింటెండెంట్ ప్రేమ్‌కుమార్, డిప్యూటీ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ సిబ్బంది, జైలు అధికారులు పాల్గొన్నారు.

పత్తి కొనుగోళ్లు తాత్కాలికంగా నిలిపివేత

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని జిన్నింగ్ మిల్లులలో పత్తి, పత్తి గింజల నిల్వలు ఎక్కువ అయినందున డిసెంబర్ 2వ తేదీ వరకు ప్రతి కొనుగోలు ప్రక్రియను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్టు జిల్లా మార్కెటింగ్ అధికారి అశ్వక్ అహ్మద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీల పరిధిలోని ఆసిఫాబాద్, వాంకిడి, కొండపల్లి, సిర్పూర్, కౌటాలలలో గల జిన్నింగ్ మిల్లులలోని పత్తి కొనుగోలు కేంద్రాలలో కొనుగోలు ప్రక్రియ నిలిపివేయడం జరుగుతుందని, 3వ తేదీ నుంచి యధావిధిగా కొనుగోలు జరుగుతుందని, రైతులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని తెలిపారు.

నవతెలంగాణ

మంచిర్యాల

ఆదివారం | డిసెంబర్ 01, 2024 | www.navatelangana.com

రైతు వేదికలో సీఎం ప్రసంగం వీక్షణ

నవతెలంగాణ-కాసిపేట



మండలంలోని ముత్యంపల్లి రైతు వేదికలో శనివారం సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగాన్ని రైతులు వీక్షించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహబూబ్‌నగర్‌లో నిర్వహిస్తున్న రైతుల పండుగ కార్యక్రమంలో రైతులను ఉద్దేశించి ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి మాట్లాడే ప్రసంగంను రైతులు వీక్షించారు. ఈ సందర్భంగా నాలుగవ విడుత రుణ మాఫీని ముఖ్యమంత్రి విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి చల్ల ప్రభాకర్, ఏఓ రమ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రత్నం ప్రదీప్, మాజీ జడ్పీటీసీ రౌతు సత్తయ్య, నాయకులు మైదం రమేష్, గోలేటి స్వామి పాల్గొన్నారు.

పాఠశాలల బంద్ విజయవంతం

నవతెలంగాణ-జన్నారం



పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో పాఠశాలల బంద్ విజయవంతం అయిందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రభంజనం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్న ఫుడ్ పాయిజన్ ఘటనల్లో ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ ఈ బంద్ చేపట్టామని అన్నారు. ప్రభుత్వం విద్యాశాఖ మంత్రిని వెంటనే నియమించాలని, అధికారులు ఎప్పటికప్పుడు వెళ్లి తనిఖీలు చేయాలని కోరారు. ప్రభుత్వం ఇప్పటికైనా సిగ్గు తెచ్చుకొని పాఠశాలల్లో, హాస్టల్స్‌లో కనీస వసతులు కల్పించి, నాణ్యమైన భోజనాన్ని అందించాలని డిమాండ్ చేశారు.

టీఎస్‌యూటీఎఫ్ మండల కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-కాసిపేట

మండల కేంద్రంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి వేల్పుల కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో ఆ సంఘం మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కే రమేశ్, ప్రధాన కార్యదర్శిగా రాజ్కుమార్, ఉపాధ్యాక్షుడిగా సోనేరావు, నవీన్, కోశాధికారిగా పద్మ కార్యదర్శులుగా అన్నపూర్ణ, భాగ్యలక్ష్మీ కృష్ణ, అడిట్ కమిటీ కన్వీనర్ సులోచన, సభ్యులుగా సునీల్, వీఓటీటీ కన్వీనర్‌గా నరసింహ, ఎఫ్ డబ్ల్యూఎఫ్ కన్వీనర్‌గా సునీతలను ఎన్నుకున్నారు. ఈ సంధర్భంగా వేల్పుల కిరణ్ కుమార్ మాట్లాడుతూ మూడు డీఏలను, పీఆర్సీ, పెండింగ్ బిల్లులను మంజూరు చేయాలని, ప్రాథమిక విద్యలో ఎస్‌జీటీలపై ఒత్తిడిని తగ్గించాలని కోరారు.

ధాన్యం ఆరిన తర్వాతే కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలి

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని పలు గ్రామాల రైతులకు స్థానిక ఎంపీడీఓ శశికళ, తహసీల్దార్ రాజ మనోహర్ రెడ్డి సూచనలు చేశారు. శనివారం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా రైతులు ఎండకు ఆరబోసిన ధాన్యాన్ని పరిశీలించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ధాన్యంలో 17 శాతం తేమ వచ్చిన తర్వాతనే కొనుగోలు కేంద్రాలకు తీసుకువెళ్లాలని వారు సూచించారు. రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తెచ్చే ముందే పూర్తిగా ఆరిన తర్వాత తీసుకురావాలన్నారు. దళారుల చేతుల్లో మోసపోకుండా కొనుగోలు కేంద్రాల్లోనే అమ్ముకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలు శాఖల అధికారులు, రైతులు, పాల్గొన్నారు.

వన్య ప్రాణుల సంరక్షణ చట్టాలపై అవగాహన ఉండాలి

నవతెలంగాణ-తాండూర్

ప్రజలు వన్యప్రాణుల సంరక్షణ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ ఇమ్రాన్ ఖాన్ సూచించారు. అటవీ శాఖ అధికారులతో కలిసి మాదారం సెక్షన్ పరిధిలో కిష్టంపేట గ్రామంలో వన్యప్రాణుల సంరక్షణ చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ మనుగడకు ప్రాణాధారమైన అడవిలో సంచరిస్తున్న మూగజీవాలకు హాని కలిగించరాదని తెలిపారు. వన్యప్రాణులను వేటాడి చంపిన విద్యుత్ వైర్లు అమర్చి జీవాలను హతమార్చిన శిక్షలు కఠినంగా ఉంటాయని తెలిపారు. పకృతిలో ప్రతి జీవికి జీవించే హక్కు ఉంటుందని, మాంసం కోసం అడవిలో సంచరించే జంతువులను వేటాడడం ఆటవిక చర్య అని అన్నారు. అడవి సంరక్షణకు అటవీ శాఖ కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటుందని చర్యల్లో భాగంగా వన్యప్రాణుల సంరక్షణ చట్టాన్ని అమలు పరుస్తుంది అని తెలిపారు. పకృతి ప్రేమికులు అడవి జంతువులను వేటాడితే సమాచారం అందించాలని కోరారు. అడవిలో నిప్పు పెట్టడం పొగ తాగడం వంటి చర్యలకు పాల్పడరాదన్నారు. అడవిలో అగ్ని ప్రమాద నివారణ గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. అడవిలో అగ్ని ప్రమాదాలు జరిగితే వెంటనే అటవీఅధికారులకు సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐ కుమారస్వామి, మదారం బీట్ అధికారి సీహెచ్ భాస్కర్, తాండూరు బీట్ అధికారి టీ గోపీకృష్ణ, ఆర్ఐ అంజన్ కుమార్ పాల్గొన్నారు.

పునరావాస కేంద్రంలో జింక మృతి

నవతెలంగాణ-జన్నారం

కవ్వాల్ టైగర్ జోన్‌లోని మండల కేంద్రంలో ఉన్న జింకల పునరావాస కేంద్రంలో జింక మృతి చెందింది. మృతి చెందిన జింకను పునరావాస కేంద్రం దగ్గరికి వెళ్లి జంతు ప్రేమికులు చూసి, ఫోటో తీసి వాట్స్‌అప్ గ్రూపులలో పోస్టు చేస్తున్నారు. ఈ జింక రెండు మూడు రోజుల క్రితమే మృతి చెందిందని అధికారులు స్పందించడం లేదని వాట్సాప్ గ్రూపులలో పోస్టు చేశారు. అప్పటివరకు కూడా అధికారులు ఆ మృతి చెందిన జింకను గుర్తించలేదు. గ్రూపులలో చూసిన తర్వాత అధికారులు హుటాహుటిన పునరావాస కేంద్రానికి వెళ్లి మృతిచెందిన జింకను బయటకు తీసి పూడ్చివేశారు. విషయంపై స్థానిక ఇన్‌చార్జి ఎఫ్ఆర్ఓ సుష్మారావు వివరణ కోరగా, ఆ జింక చాలా ముసలిది అయిందని, చలికి తట్టుకోలేక మృతి చెందింది అన్నారు. ఆ జింకను వైద్యుల సమక్షంలో ఖననం చేశామన్నారు. రెండు మూడు రోజుల క్రితం మృతి చెందలేదని, కొంతమంది కావాలని ఇలా తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు.

క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయి

- ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు

నవతెలంగాణ-దండేపల్లి

క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని క్రీడా స్ఫూర్తితో క్రీడాకారులు ఆటల్లో పాల్గొనాలని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్‌రావు అన్నారు. శనివారం మండలంలోని రెబ్బెనపల్లి ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న అండర్-17 బాల బాలికల బీచ్ వాలీబాల్ క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించి, క్రీడల్లో పాల్గొని తమ ప్రతిభను కనబరిచి స్నేహపూర్వకంగా ఆడుకోవాలని అన్నారు. గెలిచినవారు ఓడిన వారిని.. హేళన చేయకుండా స్నేహ పూర్వకంగా క్రీడా స్ఫూర్తితో మెలగాలని, అదే విధంగా నిర్వాహకులు క్రీడాకారులకు సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గిరిజన కోపరేటివ్ ఆర్థిక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ కోట్నాక తిరుపతి, జిల్లా విద్యాధికారి యాదయ్య, తహసీల్దార్ సంధ్యారాణి, కాంగ్రెస్ మండల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ కుటుంబానికి రూ.15వేల ఆర్థిక సాయం

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని కామన్పల్లి గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ కామర దుర్గయ్య కుటుంబానికి కవ్వాల్ గ్రామ ఆటో యూనియన్ నాయకులు రూ.15 వేల ఆర్థిక సాయం అందజేశారు. దుర్గయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో ఆటో యూనియన్ సభ్యులు శనివారం మృతుడి కుటుంబ సభ్యులను కలిసి ఆర్థిక సాయంతోపాటు నిత్యవసర సరుకులను అందజేశారు. ఈ సందర్భంగా ఆటో యూనియన్ అధ్యక్షుడు పంబాల నరసయ్య మాట్లాడుతూ ఆటో డ్రైవర్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని అన్నారు. దాతలు ముందుకు వచ్చి ఆ కుటుంబానికి సహకరించాలని కోరారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత

నవతెలంగాణ-దండేపల్లి

మండలంలోని మామిడిపల్లి గ్రామానికి చెందిన జిల్లాపల్లి బొందమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా నలిమెల వినయ్ స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా శనివారం రూ.5000 ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా స్వచ్ఛంద సంస్థ సభ్యులు గడ్డం త్రిమూర్తి మాట్లాడుతూ తమ ఆత్మీయ మిత్రుడు చిన్న వయసులోనే చనిపోవడం ఎంతో బాధాకరమని వినయ్ జ్ఞాపకార్థంగా స్వచ్ఛంద సంస్థ ఏర్పాటు చేసి పేదలకు సేవ కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగానే బొందమ్మది బీద కుటుంబం కావడంతో వారి కుటుంబానికి ఆర్థిక సాయం చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో వినయ్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు మరి సర్పంచ్ హెల్త్ శ్రీనివాస్, గడ్డం రామచందర్, ఆరేపల్లి రమేష్, జోగు శేఖర్, కొండ మల్లేష్, కంది శంకర్, పత్తిపాక వినోద్, మేకల రమేష్, భానుచందర్, రాజన్న పాల్గొన్నారు.

అగ్రవర్ణ ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను రద్దు చేయాలి

నవతెలంగాణ-మంచిర్యాల



దేశంలో మెజార్టీ వర్గమైన బీసీ వర్గాల ప్రయోజనాలను దెబ్బతీస్తున్న ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను రద్దు చేయాలని బీసీ సంఘాల రాష్ట్ర నాయకులు పిలుపునిచ్చారు. బీసీ జేఏసీ ఆధ్వర్యంలో మంచిర్యాలలో శనివారం నిర్వహించిన బీసీ ఐక్య సదస్సులో పాల్గొని ప్రసంగించారు. రాజ్యాంగ నియమాల ప్రకారం రిజర్వేషన్లపై బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకే హక్కు ఉన్నదని హిందూ బీసీ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల సిద్దేశ్వర్ తెలిపారు. జనాభాలో మైనార్టీగా ఉన్న అగ్రవర్ణ ప్రయోజనాల కోసమే నరేంద్ర మోడీ ప్రభుత్వం రిజర్వేషన్లను తీసుకువచ్చిందన్నారు. బీఆర్ఎస్ సర్కారు సైతం ఆ రిజర్వేషన్లను అమలు చేయడం ప్రజా వ్యతిరేకమని ఆయన పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి సర్కారు ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను రద్దుచేసి బీసీ రిజర్వేషన్లను పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. బీసీలు మెజారిటీగా ఉన్న ప్రాంతాల్లో బీసీలు ఎమ్మెల్యేలుగా ఎంపీలుగా గెలుపొందే దిశలో మంచిర్యాల జిల్లా ప్రజలు చైతన్యం కావాలని సంగెం సూర్యారావు పేర్కొన్నారు. బీసీ బిడ్డలు రాజ్యాధికారంలో కూర్చుని అగ్రవర్ణాలకు సీట్లు పంపిణీ చేసే రోజు రావాలని ఆయన కోరారు. మండల్ కమిషన్ సిఫారసు చేసిన అన్ని అంశాలను కేంద్ర ప్రభుత్వం అమలు పరచాలని ఆలిండియా ఓబీసీ జేఏసీ చైర్మన్ సాయిని నరేందర్ తెలిపారు. మెజార్టీ వర్గం ఆకాంక్షలు నెరవేర్చడమే నిజమైన ప్రజాస్వామ్యమని ఆయన పేర్కొన్నారు. రాజ్యాంగం అందించిన హక్కులు నిలబడాలంటే బహుజన చైతన్యంతో ప్రజలు ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీసీ ఐక్య వేదిక జిల్లా కన్వీనర్ వడ్డేపల్లి మనోహర్, సామాజిక న్యాయవేదిక కన్వీనర్ రంగు రాజేశం, బీసీ సమాజ్ నాయకులు శ్రీనివాస్, బీసీ జాగృతి జిల్లా అధ్యక్షుడు నరెడ్ల శ్రీనివాస్, బీసీ హక్కుల పోరాట సంఘం నాయకులు గుమ్ముల శ్రీనివాస్, బీసీ ఐక్య వేదిక జిల్లా నాయకులు కనుకుంట్ల మల్లయ్య, సీనియర్ న్యాయవాది కర్రె లచ్చన్న, మార్కెట్ కమిటీ చైర్మన్ పల్లె భూమేష్ పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికి పరిహారం ఇస్తాం

- మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్



నవతెలంగాణ-నస్పూర్

జాతీయ రహదారుల నిర్మాణంలో భాగంగా మంచిర్యాల, వరంగల్, ఖమ్మం, విజయవాడ జాతీయ రహదారి 163జి నిర్మాణంలో భూములు కోల్పోయిన అర్హులైన ప్రతి ఒక్కరికి పరిహారం అందించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఆర్డీఓ కార్యాలయంలో జాతీయ రహదారి విస్తరణలో బాధితుల కోల్పోయిన వివరాలను మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ రహదారి 163జి 384 కిలోమీటర్ల మేర ఉంటుందని, రహదారి నిర్మాణంలో భూములు కోల్పోయిన వారి జాబితా ప్రకారం బాధితులకు నష్టపరిహారం చెల్లించడం జరిగిందని, ఆర్బిట్రేషన్ కొరకు దరఖాస్తు చేసుకున్న వారికి పరిహారం అందించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. మొదటి జాబితాలో పరిహారం అందని అర్హత గల వారు సంబంధిత పత్రాలు, బ్యాంక్ పాస్ పుస్తకాలతో సంప్రదించినట్లయితే రికార్డులు పరిశీలించి సరిగ్గా ఉన్నట్లు నిర్ధారణ జరిగితే సంబంధిత లబ్ధిదారుల నుండి అక్విటెన్సీ తీసుకొని పరిహారం చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. భూములలో చెట్లు, బోర్లు, పైప్‌లు ఉన్నట్లయితే సంబంధిత ఫొటోలు తీసుకొని పక్క భూమి రైతు వద్ద సంతకం తీసుకొని తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని, నిర్దేశిత ధరల ప్రకారం పరిహారం చెల్లించడం జరుగుతుందని, నష్టపోయిన వారు ఆలస్యం చేయకుండా త్వరగా దరఖాస్తు చేసుకునేలా అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

నవతెలంగాణ-దండేపల్లి



ఎన్నో ఏండ్లుగా సమగ్ర శిక్ష అభియాన్‌లో పని చేస్తున్న కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకంచాలని ఆ సంఘం మండల అధ్యక్షుడు చుంచు మల్లేష్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో నల్ల బ్యాడ్జిలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చుంచు మల్లేష్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనలో కూడా తాము రెగ్యులర్ సిబ్బందితోపాటు నిరసనలు చేశామని తెలంగాణ వచ్చాక అప్పటి ప్రభుత్వం తమకు న్యాయం చేస్తుందని తమను క్రమబద్ధీకరిస్తుందని అనుకుంటే వారు కూడా మొండి చేయి చూపించారని అన్నారు. కొత్త సంవత్సరం పీసీసీ అధ్యక్షుని హోదాలో తాము నిరసన వ్యక్తం చేస్తున్నప్పుడు సీఎం రేవంత్‌రెడ్డి తమ ప్రభుత్వం ఏర్పడినాక వంద రోజుల్లో రెగ్యులర్ చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఏడాదిక వస్తున్న సమస్యలు పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. క్రమబద్ధీకరించే వరకు మినిమం టైమ్స్ స్కెల్ ఇస్తూ ప్రతి ఉద్యోగికి పది లక్షల ఇన్సూరెన్స్ సౌకర్యం ఉద్యోగ భద్రత రిటైర్మెంట్ బెనిఫిట్స్ కింద రూ.పది లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లా విద్యాధికారికి కార్యాలయంలో వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. ప్రభుత్వం స్పందించి తమకు న్యాయం చేయాలని లేని పక్షంలో పూర్తిస్థాయిలో సమ్మెకు వెనకాడమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి నాగేష్, మహిళా అధ్యక్షురాలు మంజుల, సర్వ శిక్ష అభియాన్ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆర్కే ఓసీలో 133శాతం బొగ్గు ఉత్పత్తి



నవతెలంగాణ-మందమర్రి

ఆర్కే ఓసీలో 133 శాతం బొగ్గు ఉత్పత్తి సాధించిందని మందమర్రి ఏరియా జీఎం దేవేందర్ తెలిపారు. గురువారం జీఎం కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో నవంబర్ నెలలో ఏరియా ఉత్పత్తి ఉత్పాదకత సంక్షేమ కార్యక్రమాల గురించి వెల్లడించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ భూ గర్భ గనుల్లో కేకే- 5 117 శాతం, కాసిపేట-1 64 శాతం, కాసిపేట-2 55శాతం, శాంతిఖని 53 శాతంతో భూ గర్భ గనుల్లో మొత్తం 74 శాతం, ఉపరితల గనుల్లో ఆర్కే ఓసీ 133శాతం, కెకె ఓసీ 34 శాతంతో ఉపరితల గనుల్లో 57శాతం సాధించాయన్నారు. ఏరియా మొత్తంగా 60 శాతం ఉత్పత్తి జరిగినట్లు, వార్షికంగా నవంబర్ వరకు 23,95,500 టన్నులు కాగా 17,34,943 టన్నుల ఉత్పత్తితో ఏరియా 72 శాతం సాధించినట్లు తెలిపారు. భూగర్భ గనుల్లో 30 నుండి 35శాతం కార్మికుల గైర్హాజరు వలన 6డ్రిల్స్ వినియోగానికి గాను 3,4 డ్రిల్స్ మాత్రమే ఉపయోగిస్తున్నట్లు దీని ప్రభావంతో ఉత్పత్తి తగ్గినట్లు తెలిపారు. కెకె ఓసీలో ఓబీ రిమూవ్ కాంట్రాక్టర్ కొంత వెనుకబడి ఉండటం కూడా ఉత్పత్తి తగ్గడానికి కారణం అన్నారు. మ్యాన్ పవర్, మెషినరీస్ ఎక్విప్మెంట్ ఉపయోగించుకుని రోజూ వారి ప్రణాళికతో ఓబీ ఇంక్రీస్ చేసి వార్షిక లక్ష్యం 100శాతం పూర్తి చేయడానికి కృషి చేస్తామన్నారు. ఏరియాలోని అధికారులు ఉద్యోగులు కాంట్రాక్టర్లు అందరూ రక్షణతో పాటు ఉత్పత్తి చేయాలని సూచించారు. నవంబర్ లో ఎంఎంసీ 1, 21క్వార్టర్లను, సిఎంపిఎఫ్ 21, గ్రాట్యుటీ 33, పెన్షన్ 32, సిపిఆర్ఎంఎస్ కార్డ్స్ 30 అందచేసినట్లు తెలిపారు. ఏరియాలోని 5 ప్రదేశాల్లో చేపట్టిన 67.5 మెగా వాట్ల సోలార్ పవర్ ప్రాజెక్ట్ 3 నెలల్లో అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ ప్రాజెక్ట్ వలన ట్రాన్స్‌కో నుండి తీస్కుంటున్న విద్యుత్ రోజు దాదాపు రూ.15లక్షల సంస్థకి ఆదా అవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీజీఎం ఈ అండ్ ఎం వెంకటరమణ, డీజీఎం ఐఈడి రాజన్న, పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, సివిల్ ఎస్ఈ రాము, డీవైపీఎం ఎండీ ఆసిఫ్ పాల్గొన్నారు.

నేడు మాలల సింహ గర్జనకు అధిక సంఖ్యలో తరలి వెళ్లాలి

నవతెలంగాణ-జన్నారం



హైదరాబాదులోని పెరేడ్ గ్రౌండ్‌లో ఆదివారం నిర్వహించే మాలల సింహగర్జన సభకు మాల కులస్తులు అధిక సంఖ్యలో తరలి వెళ్లాలని మాల మహానాడు మండల అధ్యక్షుడు పాత బాలరాజ్, జిల్లా నాయకులు చిటిమల భరత్ కుమార్ సూచించారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. అనంతరం చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి పుట్టినరోజు వేడుకలను కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. మాలలు ఐక్యంగా ఉండి తమ హక్కులను సాధించుకోవాలన్నారు. కార్యక్రమంలో మాల సంఘం నాయకులు బెంజిమెన్,, మేకల మాణిక్యం, మూగల వెంకటేష్, దశంద్ల రాజన్న పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల కబ్జాలకు పాల్పడితే చర్యలు

నవతెలంగాణ-తాండూర్

ప్రభుత్వ భూముల కబ్జాలకు పాల్పడితే శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని బెల్లంపల్లి తహసీల్దార్ జోష్న తెలిపారు. శనివారం కన్నాల శివారులోని సర్వే నెంబరు 141, 142 98లో జాతీయ రహదారి పక్కన అక్రమంగా నిర్మిస్తున్న నిర్మాణాలను కూల్చివేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. బెల్లంపల్లి పట్టణంలో ప్రభుత్వం భూములను కాపాడేందుకు, ప్రభుత్వ భూముల సంరక్షణ కమిటీ సూచనల మేరకు రెవిన్యూ సిబ్బంది కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటుందన్నారు. ప్రభుత్వ భూముల్లో అనుమతి లేని నిర్మాణాలు చేపడితే కూల్చివేయడం జరుగుతుందని తెలిపారు. ఇప్పటికే పలు ప్రాంతాలలో ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. బెల్లంపల్లి పట్టణంలో అ క్రమనకు గురైన ప్రభుత్వ స్థలాలను స్వాధీనం చేసుకునేందుకు చూస్తున్నారని తెలిపారు. అందుకు పోలీసు అధికారులు రాజకీయ నాయకులు స్వచ్ఛంద సేవ సంస్థలు ప్రభుత్వ భూములను కాపాడేందుకు సహకరించాలని కోరారు. కబ్జాదారులు ప్రభుత్వ భూములు అక్రమాలకు పాల్పడిన అక్రమ నిర్మాణాలు చేపట్టిన అందించాలని తెలిపారు. ఆమె వెంట ఆర్ఐ ఆదిలక్ష్మి రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

మంత్రి పదవి కోసం తప్పుడు ప్రచారం

నవతెలంగాణ-మంచిర్యాల

ఎమ్మెల్యే గడ్డం వివేక్ మంత్రి పదవి కోసం తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారని బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ఆరోపించారు. శనివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన నేతకానీ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎటువంటి అనుమతులు లేకుండా ఆదివారం జరిగే మాలల సింహ గర్జన సభకు సంబంధించిన ఫ్లెక్సీలో నేతకానీ సామాజిక వర్గానికి చెందిన తన ఫోటోలతో పాటు మాజీ ఎంపీ వేంకటేష్ నేతల ఫొటోలు ఏర్పాటు చేయడంపై అగ్రహం వ్యక్తం చేశారు. అయన స్వలాభం కోసం ఉప కులాలను కలుపుతూ నేతకానీ సామాజిక వర్గంపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని పేర్కొన్నారు. మాల సామజిక వర్గం అభ్యున్నతికి పాటు పడుతున్న అని చెప్పానే జిల్లాలోని మాల కులస్థులను ఆర్థికంగా, రాజకీయంగా ఎదుగకుండా తొక్కకుతున్నది గడ్డం ఫ్యామిలీ అని స్పష్టం చేశారు. 30 లక్షలు ఉన్న మాల కులంలో మెజారిటీ పరంగా నేత కానీలే ఎక్కువ ఉన్నారని తెలిపారు. నేతకాని మాల సామజిక వర్గాలు వేరు వేరు అని స్పష్టం చేశారు. వివేక్ తన స్వంత ప్రయోజనాల కొరకు మాల సామజిక వర్గం పేరు వాడుకుంటున్నాడని, ఆదివారం జరగబోయే మాలల సింహ గర్జన సభకు నేతకానీలు ఎవరు హాజరవ్వద్దని కోరారు. సమావేశంలో నేతకానీ సంఘం నాయకులు దుర్గం రాజేష్‌లతో పాటు పలువురు నేతకాని కుల సభ్యులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి పేదింటి ఆడపడుచులకు వరం

నవతెలంగాణ-జన్నారం

కల్యాణలక్ష్మి పథకం పేదింటి ఆడపడుచులకు వరం లాంటిదని, ప్రజా సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ప్రజల సంక్షేమానికి పథకాలు అమలు చేస్తున్నామని, వాటిని వారు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రూ.రెండు లక్షల వరకు రుణమాఫీ చేసి రైతులకు వెన్నుదన్నుగా నిలుస్తుందని అన్నారు. అనంతరం మండలంలోని మహమ్మదాబాద్ చింతగూడ, పీఏసీఎస్ ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు తమ పండించిన వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే అమ్ముకోవాలన్నారు. ప్రభుత్వం సన్నరకం వడ్లకు రూ.500 బోనస్ అందిస్తుందన్నారు. దళారుల చేతుల్లో మోసపోవద్దన్నారు. అనంతరం మండల కేంద్రంలోని రైతు వేదికలో మహబూబ్‌నగర్ జిల్లా నుంచి రైతు సంబరాల కార్యక్రమంలో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి, లైవ్ టెలికాస్ట్‌లో పాల్గొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజ మనోహర్‌రెడ్డి, ఎంపీడీఓ శశికళ, ఏఓ సంగీత, ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ జలంధర్, పార్టీ అధ్యక్ష కార్యదర్శులు, ముజాఫర్ అలీ ఖాన్, మేకల మాణిక్యం, రాజశేఖర్, ఇసాక్, ఏవిఆర్ శంకరయ్య, మమ్మద్ రియాజుద్దీన్, నందు నాయక్, మామిడిపల్లి ఇందయ్య, రమేష్, బండారి స్వామి, మల్క లక్ష్మణ్, ఫసియుల్లా పీఏసీఎస్ చైర్మన్ రవి, షాకీర్, గంగన్న, రాజన్న, సోహెల్ అజ్మత్, పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యాన్ని సక్రమంగా పంపిణీ చేయాలి

నవతెలంగాణ-తాండూర్

ప్రజలకు పంపిణీ చేసే పీడీఎస్ బియ్యాన్ని సక్రమంగా పంపిణీ చేయాలని తహసీల్దార్ ఇమ్రాన్ ఖాన్ సూచించారు. శనివారం ఆహార సలహా సంఘం సమావేశంలో భాగంగా తాండూర్ మండల రేషన్ డీలర్ల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పంపిణీ చేసే పీడీఎస్ బియ్యాన్ని కార్డుదారులకు సక్రమంగా పంపిణీ చేయాలని సూచించారు. బియ్యం ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి దిగుమతి చేసుకున్న తర్వాత రోజు నుంచి పంపిణీ చేయాలని తెలిపారు. రోజువారీగా స్టాక్ రిజిస్టర్ మెయింటెన్ చేయాల న్నారు. వచ్చిన స్టాకు ప్రారంభపు నిల్వ పంపిణీ మిగులు సరుకు వివరాలు స్టాక్ రిజిస్టర్లు పొందుపరచాలని సూచించారు. చౌక ధరల దుకాణం ముందు షాపు వివరాలు తెలిపే బోర్డు. స్టాక్ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. బియ్యాన్ని న్యాయబద్ధంగా తూకం వేయాలని తెలిపారు. అక్రమాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో ఆర్ఐ ఏజాజొద్దీన్, అంజన్ కుమార్, డీలర్లు శంకరయ్య, తిరుమల, రంగుల లక్ష్మి, వసీం పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
ఆదివారం | డిసెంబర్ 01, 2024 | www.navatelangana.com

మున్సిపల్ ఫ్లోర్ లీడర్ జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-లక్సెట్టిపేట

మున్సిపాలిటీ కాంగ్రెస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చెల్ల నాగభూషణం జన్మదిన వేడుకలను శనివారం తన నివాసంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఘనంగా జరుపుకున్నారు. కేక్ కట్



చేసిన అనంతరం శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు షాహిద్ అలీ, కాంగ్రెస్ మైనార్టీ అధ్యక్షులు నవాబు ఖాన్, చిన్న రమేష్, పడాల గౌతమ్, అబ్బు బాయి, సూరారం చంద్రమౌళి పాల్గొన్నారు.

నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడమే లక్ష్యం

నవతెలంగాణ-నస్పూర్

నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడమే నా లక్ష్యమని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు అన్నారు. శనివారం నస్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని 11,18,19,21 వార్డుల్లో పర్యటించి ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వాటిని వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పరిష్కరిస్తామని, నియోజకవర్గంలోని ప్రతి వార్డును అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సతీష్, మున్సిపల్ చైర్మన్ వేణు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వర్గీకరణను వ్యతిరేకిస్తున్న ఎమ్మెల్యేలను సస్పెండ్ చేయాలి

- ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు ఆరెల్లి మల్లేష్ మాదిగ



నవతెలంగాణ-బజార్‌హత్నూర్

ఎస్సీ వర్గీకరణ వ్యతిరేకిస్తున్న కాంగ్రెస్ ఎమ్మెల్యేలను తక్షణమే పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు ఆరెల్లి మల్లేష్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సుప్రీంకోర్టు ఆగస్టు ఒకటిన ఎస్సీ వర్గీకరణ రాష్ట్రాలకు అధికారాన్ని కల్పిస్తూ ఇచ్చిన తీర్పును రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిండు శాసనసభలో మాట్లాడుతూ వర్గీకరణను తీర్పును స్వాగతిస్తూ, దేశంలోనే మొదటి వర్గీకరణ చేసే రాష్ట్రంగా మనదే ఉంటుందన్నారు. అలాగే ఇప్పటికే ఇచ్చిన ప్రతి నోటిఫికేషన్‌లో వర్గీకరణ అమలు చేసే విధంగా ఆర్డినెన్స్ తీసుకొస్తామని ప్రకటించడం జరిగిందని అన్నారు. సుప్రీంకోర్టు తీర్పు కాంగ్రెస్ విధానాలకు నిర్ణయాలకు ముఖ్యమంత్రి ప్రకటనకు విరుద్ధంగా, అన్ని రాజకీయ పార్టీలు పౌర సమాజం ప్రజా సంఘాలు ముక్తకంఠంతో ఏకీభవించిన వర్గీకరణను వ్యతిరేకిస్తున్న మాల సామాజిక వర్గానికి చెందిన కొంతమంది ఎమ్మెల్యేలపై కాంగ్రెస్ ఎందుకు క్రమశిక్షణ చర్యలు తీసుకోవడం లేదని ఆయన ప్రశ్నించారు. అలాంటి వారిని ఎందుకు పార్టీ నుంచి బహిష్కరించడం లేదన్నారు. ఒకవైపు అంబేద్కర్ వారసులంటూ ఆయన సూచించిన సామాజిక న్యాయానికి తుట్లు పొడుస్తూ తమ స్వార్థ రాజకీయ ప్రయోజనాల పదవుల కోసం అమాయకమైనటువంటి నిరుపేద మాలలకు వెన్నుపోటు పొడుస్తున్న వారిని సమాజం కూడా గమనిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు సందూరి వినయ్, సాగర్, ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు బరుకుంట సుభాష్, మండలాధ్యక్షులు గోధుమలె అనిల్, సంజీవ్, నవీన్, నరేష్ పాల్గొన్నారు.

సదరం షెడ్యూల్ విడుదల

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మీ సేవా ద్వారా స్లాట్ బుకింగ్ చేసుకొని వెయిటింగ్ లిస్టులో ఉండి సెల్ ఫోన్‌కు మెసేజ్ వచ్చిన తేదీలలో గవర్నమెంట్ జనరల్ ఆసుపత్రిలో హాజరుకావాలని జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి విజయలక్ష్మి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డిసెంబర్ 4,10,17న ఆర్థోపెడికల్లి హ్యాండి క్యాపుడ్ అండ్ సివిప, 5న మెంటల్ రిటర్డేషన్ అండ్ మెంటల్‌యిల్‌నెస్, 12న విజువల్ హ్యాండికాపుడ్, 20న హియరింగ్ ఇంపరిమెంట్ వారికి క్యాంపు నిర్వహించడం జరుగుతుందన్నారు. మొబైల్‌కు సమాచారం అందిన వారు మాత్రమే వారికి కేటాయించిన తేదీలలో ఉదయం తొమ్మిది గంటలలోపు హాజరు కావాలన్నారు. వెంట మీ సేవ సదరం స్లాట్ బుకింగ్ రశీదు, ఆధార్ కార్డ్ జిరాక్స్, సదరం సర్టిఫికల్స్ కాల పరిమితి అయిపోయిన వారు పాత రేషన్ కార్డ్, సదరం సర్టిఫికెట్స్ జిరాక్స్ తీసుకొని రావాలన్నారు. కొత్త పాస్ పోర్ట్ సైజు ఫోటో, కంటి వైకల్య దివ్యాంగులు సరోజినీ దేవి హాస్పిటల్, ఎల్‌వి ప్రసాద్ హాస్పిటల్ రిపోర్టు, చెవిటి మూగ దివ్యాంగులు ఈఎన్టీ కోఠి హైదరాబాద్ ప్రభుత్వ హాస్పిటల్‌లో చూపించుకున్న బిఈఆర్‌ఏ మరియు పిటిఏ రిపోర్ట్స్ ఒరిజనల్‌తో పాటు జిరాక్స్, ఎంఆర్ మరియు ఎంఐ దివ్యాంగులు బోయినపల్లి మెంటల్ హాస్పిటల్ సికింద్రాబాద్‌లో చూపించుకున్న రిపోర్ట్స్ ఒరిజనల్ జిరాక్స్, ఆర్థోపెడికి వైకల్యం గల దివ్యాంగులు పాత కొత్త ఎక్స్‌రే రిపోర్టులు, పక్షవాతం గలవారు ఎమ్మారై సిటీ స్కానింగ్ రిపోర్ట్ ఒరిజినల్‌తో హాజరుకావాలని తెలిపారు.

జిల్లా వ్యాప్తంగా 30, 30(ఎ) పోలీసు యాక్ట్ అమలు

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా జిల్లా వ్యాప్తంగా నెల రోజుల పాటు డిసెంబర్ 1 నుండి 31 వరకు 30,30(ఎ) పోలీసు యాక్ట్-1861 అమలులో ఉంటుందని ఎస్పీ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పోలీసు అధికారుల ముందస్తు అనుమతి లేనిది ప్రజలు, ప్రజా ప్రతినిధులు ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్‌లు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని, శాంతి భద్రతలకు భంగం కలిగించే విధంగా, ప్రజా ధనానికి నష్టం కల్గించే, చట్ట వ్యతిరేక కార్యకలాపాలు చేపట్టకూడదని పేర్కొన్నారు. జిల్లా ప్రజలు, ప్రజా ప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు ఇట్టి విషయంలో పోలీసు వారికి సహకరించాలని సూచించారు. అనుమతి లేకుండా పైచర్యలకు పాల్పడితే సంబంధిత వ్యక్తులపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

కుష్టువ్యాధి నిర్మూలనకు చర్యలు

నవతెలంగాణ-నార్నూర్

కుష్టు వ్యాధి నిర్మూలనకు చర్యలు చేపడుతున్నట్లు డాక్టర్ రాంబాబు పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో అన్ని గ్రామాల పరిధిలోని ఆశాలకు వ్యాధిపై అవగాహన కల్పించారు. డిసెంబర్ నెలలో చేపట్టే కుష్టువ్యాధి సర్వే కార్యక్రమంలో భాగంగా ఆశా కార్యకర్తలకు, సిబ్బందికి శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. డిసెంబర్ 2 నుంచి 15 వరకు మండలంలోని అన్ని గ్రామాలో సర్వే చేసి కుష్టువ్యాధి లక్షణాలు కలిగిన వారిని గుర్తించి, వ్యాధి లక్షణాలు కలిగిన వారికి ఉచితంగా మందులు అందిస్తామన్నారు. వ్యాధి లక్షణాలు కలిగిన వారు ఆందోళన చెందకుండా క్రమం తప్పకుండా మందులు వాడితే వ్యాధి పూర్తిగా నయమవుతుందన్నారు. ఆశాలు తమ గ్రామాల్లో రోజువారీగా ఇంటింటి సర్వే నిర్వహించాలని, లక్షణాలు కలిగిన వారిని గుర్తించి, వారి పేర్లను ఆరోగ్య కేంద్రంలో నమోదు చేయాలని సూచించారు. అవగాహన కార్యక్రమంలో డాక్టర్ జితేందర్‌రెడ్డి, సిహెచ్‌ఓ లక్ష్మి, హెచ్‌ఈఓ తులసిదాస్, సూపర్వైజర్ చౌహన్ చరణ్‌దాస్, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులకు ఘన సన్మానం

నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియాలోని వివిధ గనులలో పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు శనివారం ఘనంగా సన్మానించారు. ఎస్ఆర్పి-1 గనిలో గని మేనేజర్ విజయ్ కుమార్, ఆర్కె-6 గనిలో మేనేజర్ తిరుపతి, ఉపరితల గనిపై గని మేనేజర్ బ్రహ్మాజీ, టీబీజీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, ఏరియా ఉపాధ్యక్షుడు పెట్టేం లక్ష్మణ్, సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ) బ్రాంచ్ నాయకుడు కస్తూరి చంద్రశేఖర్, ఫిట్ సెక్రటరీలు పదవి విరమణ పొందుతున్న ఉద్యోగులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనుభవజ్ఞులైన ఉద్యోగుల సేవలను సింగరేణి సంస్థ కోల్పోతుందని తెలిపారు. ఉద్యోగ విరమణ చేస్తున్న అనుబవాగ్యులైన ఉద్యోగుల నుండి వారి అంకితభావాన్ని విధుల పట్ల నిబద్ధతను వారసత్వంగా తీసుకోవాలని కోరారు. వచ్చే డబ్బులను వృధా చేయకుండా బ్యాంకులో జమ చేసుకొని భద్రపరుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ఉద్యోగులు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

పంచాయతీ సిబ్బందిని పర్మినెంట్ చేయాలి

- సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్



నవతెలంగాణ-కడెం

గ్రామపంచాయతీ ఉద్యోగ కార్మికులను ప్రభుత్వం పర్మినెంట్ చేయాలని, వేతనాలకు ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్ కేటాయించి నెలనెల సిబ్బంది అకౌంట్‌లో వేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం పెద్ద బెల్లాల్ గ్రామపంచాయతీలో పంచాయతీ కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామపంచాయతీ సిబ్బంది మూడు నెలల బకాయి వేతనాలు తక్షణమే చెల్లించాలని అన్నారు. ప్రభుత్వం మధ్య ప్రకటించిన పంచాయతీరాజ్‌శాఖ గ్రామీణాభివృద్ధిశాఖ ఉద్యోగులకు నేరుగా వేతనాలు ఇచ్చే విధంగా వేతనాలను గ్రామపంచాయతీ సిబ్బంది కూడా వేతనాలు చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గ్రామపంచాయతీ వ్యవస్థ ఏర్పడి 60 సంవత్సరాలు గడిచినప్పటికీ గ్రామపంచాయతీ సిబ్బందిని పర్మినెంట్ చేయకపోవడం ప్రభుత్వాల దివాలా కోరు విధానాలకు నిదర్శనమని అన్నారు. తరాలు మారిన ప్రభుత్వాలు మారిన గ్రామపంచాయతీ బ్రతుకులు మారలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామపంచాయతీ కార్మికులకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. నవంబర్ 20వ తేదీలోపు గ్రామపంచాయతీ కార్మికుల న్యాయమైన సమస్యలు అన్నింటిని పరిష్కరించకుంటే నిరవధిక సమ్మె చేపడుతామని హెచ్చరించారు. అదేవిధంగా మధ్యాహ్న భోజన కార్మికుల వేతనాలు, బిల్లులు నాలుగు నెలలు పెండింగ్ ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి రాధా, తెలంగాణ గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ రాములు, నవీన్, సాంబయ్య, భూమయ్య, అశోక్ పాల్గొన్నారు.

చారిత్రాత్మక ప్రదేశాల వద్ద సుందరీకరణ పనులను చేపట్టాలి

- నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



నవతెలంగాణ-నిర్మల్

చారిత్రాత్మక ప్రదేశాల వద్ద సుందరీకరణ పనులను చేపట్టాలని నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా కేంద్రంలోని శ్యామ్‌ఘడ్ కోట, ధర్మసాగర్ చెరువును అధికారులతో కలిసి సందర్శించారు. శ్యామ్‌ఘడ్ కోట వద్ద చేపట్టనున్న ఫుట్‌పాత్, రోడ్డు వెడల్పు, విద్యుత్ దీపాల ఏర్పాటు పనులపై అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. పురాతన కట్టడాల సంరక్షణ బాధ్యత అందరిపై ఉందని తెలిపారు. చారిత్రాత్మక ప్రదేశాలను ఆహ్లాదకరంగా తీర్చిదిద్ది పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధికి చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లాలోని పలు చారిత్రాత్మక ప్రదేశాలను దశలవారీగా అభివృద్ధి చేయాలని అధికారులను ఆదేశించారు. పర్యాటకులను ఆకర్షించే విధంగా అన్ని సౌకర్యాలను కల్పించాలన్నారు. హైమాస్ లైట్లను ఏర్పాటు చేసి ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలకు తావు లేకుండా చూడాలన్నారు. అనంతరం బస్టాండ్ సమీపంలోని ధర్మసాగర్ చెరువు మినీ ట్యాంక్ బండ్‌ను పరిశీలించారు. మినీ ట్యాంక్‌బండ్‌ను సుందరంగా తీర్చిదిద్దాలన్నారు. మురుగునీరు చెరువులో కలువకుండా చర్యలు తీసుకోవాలని, వాహనాల పార్కింగ్‌కు స్థలాన్ని గుర్తించాలని ఆదేశించారు. ట్యాంక్‌బండ్ పరిసర ప్రాంతాలలో నిరంతరం మెరుగైన పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్ అండ్ బి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అశోక్ కుమార్, మున్సిపల్ డిప్యూటీ ఇంజనీర్ హరిభువన్, నిర్మల్ అర్బన్ తహసీల్దార్ రాజు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలల బంద్ ప్రశాంతం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

వసతి గృహాలతో పాటు ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని వామపక్ష విద్యార్థి సంఘాల ఐక్య కార్యాచరణ సమితి జిల్లా నాయకుడు గణేష్ డిమాండ్ చేశారు. ఫుడ్ పాయిజన్ ఘటనలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వ వైఖరికి నిరసనగా శనివారం ప్రభుత్వ విద్యా సంస్థల బంద్‌కు పిలుపునిచ్చారు. పట్టణంలో అక్కడక్కడ తెరిచి ఉన్న ప్రభుత్వ పాఠశాలలను జేఏసీ నాయకులు మూసివేయించారు. ప్రభుత్వ వసతిగృహాలు, విద్య సంస్థల్లో అధికారులు పర్యవేక్షణ లోపం కారణంగా నాసిరకమైన భోజనం అందిస్తున్నారని వామపక్ష విద్యార్థి సంఘాల ఐక్య కార్యాచరణ సమితి జిల్లా నాయకుడు గణేష్ ఆరోపించారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా వాంకిడి మండలంలో విద్యార్థి శైలజ ఫుడ్ పాయిజన్ కారణంగా మరణించిందన్నారు. ఆమె కుటుంబానికి ప్రభుత్వం ఇప్పటి వరకు ఆదుకోలేదన్నారు. కుటుంబంలో ఒకరికి ఉద్యోగంతో పాటు రూ.5.50 లక్షల నష్టపరిహారం, ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదే విధంగా ఫుడ్ పాయిజన్ ఘటనలు పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని కోరారు. మళ్లీ ఇలాంటి సంఘటనలు పునరావృతమైతే వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో భవిష్యత్ కార్యక్రమం రూపొందించి ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కొట్నాక్ సక్కు, యూఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు అల్తాఫ్, పీడీఎస్‌యూ జిల్లా సహాయ కార్యదర్శి దత్తు, పీవైఎల్ జిల్లా నాయకులు మారుతి పాల్గొన్నారు.

నిర్మల్‌రూరల్ : గురుకుల, సంక్షేమ హాస్టళ్లు, జిల్లా పరిషత్, ప్రాథమిక పాఠశాలల్లో నాణ్యత లేని భోజనం తిని విద్యార్థులు వరుసగా అస్వస్థతకు గురవుతున్నారని, దీనికి ముఖ్యమంత్రి బాధ్యత వహించాలని రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ వామపక్ష విద్యార్థి సంఘాలు శనివారం ఇచ్చిన పాఠశాలల బంద్ విజయవంతమైంది. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల బంద్ పాటించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్, పిడిఎస్‌యూ, ఎస్ఎఫ్ఐ నాయకులు కైలాష్, సింగరి వెంకటేష్, దిగంబర్, కిరణ్ పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే వివేక్ జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-జైపూర్

ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి జన్మదిన వేడుకలు మండల కేంద్రంలో శనివారం ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులతో కలిసి వివిధ గ్రామాలకు చెందిన మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా కార్యకర్తలకు నాయకులు స్వీట్లు పంపిణీ చేశారు.

భీమారంలో..

భీమారం మండల కేంద్రంలో ఎమ్మెల్యే గడ్డం వెంకటస్వామి జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు చేకుర్తి సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి స్వీట్లు పంపిణీ చేశారు. అదేవిధంగా ఆదివాసీ కాలనీలో కుక్కల నరేష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.



మందమర్రి : ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నోముల ఉపేందర్ గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక మనోవికాస్ పాఠశాలలో కేక్ కట్ చేసి విద్యార్థులకు నోటు బుక్కులు, పెన్నులు, స్వీట్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, సీనియర్ నాయకులు సోతుకు సుదర్శన్, తిరుమల్ రెడ్డి, పైడిమల్ల నర్సింగ్, ఆకారం రమేష్, ఎండీ సుకూర్, కడలి శ్రీనివాసరావు, పోలు శ్రీనివాస్, నర్సోజి, యువజన పాల్గొన్నారు.



ఆదిలాబాద్‌టౌన్ : మాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శనివారం చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా కేక్ కట్ చేసి ఒకరికొకరు తినిపించుకున్నారు. ఈ కార్యక్రమంలో మాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కొప్పుల రమేష్, వ్యవస్థాపక అధ్యక్షులు బేర దేవన్న, సంయుక్త కార్యదర్శి ముల్కల రాజేశ్వర్, అసోసియేట్ అధ్యక్షులు రాఘవేంద్ర, మొట్టె కిరణ్, మలపతి సుభాష్, సూరం భగవాండ్లు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ మెట్టు ప్రహ్లాద్, అశోక్, స్వామి పాల్గొన్నారు.

స్వయం ఉపాధి పొంది ఆర్థికంగా ఎదగాలి



నవతెలంగాణ-కడెం

మహిళలు స్వయం ఉపాధి పొంది ఆర్థికంగా ఎదగాలని రాష్ట్ర మహిళ కమిషన్ సభ్యురాలు కుమ్ర ఈశ్వరీబాయి అన్నారు. శనివారం మండలంలోని పెద్దూర్ జీపీ పరిధిలోని కొలంగూడ గ్రామాన్ని ఐటీడీఏ పీవీటీజీ ఏపీఓ మెస్రం మనోహర్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలో నీటి సౌకర్యాలు, రోడ్లు, అంగన్‌వాడీ భవనం తదితర వాటిని పరిశీలించారు. అలాగే ఐటిడిఎ ఆధ్వర్యంలో గిరిజన కోఆపరేటివ్ సొసైటీ సహకారంతో త్వరలో ప్రారంభం కానున్న పల్లి పట్టి తయారీ కేంద్రాన్ని పరిశీలించి, పల్లి పట్టి తయారీ విధానాన్ని స్థానిక మహిళలను అడిగి తెలుసుకున్నారు. ఇలాంటి యూనిట్ ఏర్పాటు చేయడం ద్వారా మహిళలు స్వయం ఉపాధి పొంది ఆర్థికంగా ఎదుగుటకు చక్కటి అవకాశమని అన్నారు. అలాగే ఇండ్ల మంజూరుకై సమస్యను ఐటీడీఏ పీఓ దృష్టికి తీసుకెళ్తానని ఆమె తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ పీవీటీజీ ఏపీఓ మెస్రం మనోహర్, జేడీఎం నాగభూషణం, సూపర్‌వైజర్ గంగాధర్ ఉన్నారు.

పెండింగ్ డబుల్ బెడ్‌రూం నిర్మాణాలను పూర్తి చేయాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పెండింగ్‌లో ఉన్న డబుల్ బెడ్‌రూం నిర్మాణాలను పూర్తి చేయాలని కలెక్టర్ రాజర్షిషా తెలిపారు. శనివారం డబుల్ బెడ్ రూమ్ పథకంపై కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. పనుల పురోగతిని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. 2 బీహెచ్‌కే హౌసింగ్ స్కీమ్ లబ్ధిదారుల కోసం చర్చించడానికి, ఖరారు చేయడానికి ఎంపిక ప్రక్రియను సమీక్షించారు. గ్రామీణ ప్రాంతంలోని (567) 2 బిహెచ్‌కే ఇళ్ల లబ్ధిదారుల ఎంపికను ఖరారు చేయాలని ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లోని అన్ని ఇళ్లకు మౌలిక సదుపాయాలు కల్పించడానికి రూ.3.40 కోట్లు మంజూరు చేయబడ్డాయని పేర్కొన్నారు. ఈఈ (పీఆర్) మౌలిక సదుపాయాల కోసం ప్రతిపాదనలను అందజేయాలని ఎగ్జిక్యూటింగ్ ఏజెన్సీ నుండి ప్రతిపాదనలు అందిన వెంటనే, సంబంధిత ఎగ్జిక్యూటింగ్ ఏజెన్సీకి అడ్మినిస్ట్రేటివ్ అనుమతి ఇవ్వబడుతుందని పేర్కొన్నారు. ప్రతిష్ఠాత్మకమైన ప్రభుత్వ కార్యక్రమంగా ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించబడుతున్న ఆధునిక నిర్మాణ పద్ధతిలో ఖర్చుతో కూడుకున్న, నిలకడగా ఉండేలా చూపించి, ప్రదర్శన గృహం నిర్మాణానికి ఎంపిడిఓ కార్యాలయ ఆవరణలో స్థలాన్ని గుర్తించాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలదేవి సంబంధిత అధికారులు, తహసీల్దార్లు ఉన్నారు.

చింతగూడ గల్ఫ్ సంక్షేమ సమితి కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని చింతగూడ గ్రామ గల్ఫ్ సంక్షేమ సమితి కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఇమిడిసెట్టి లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శిగా కొండకూరి ప్రశాంత్, ఇతర కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గల్ఫ్ కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని అన్నారు. గల్ఫ్ బాధిత కుటుంబాలకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం : ఎస్ఐ రాజవర్ధన్

నవతెలంగాణ-జన్నారం

క్రీడల్లో గెలుపోటములు సహజమని జన్నారం ఎస్ఐ గుండేటి రాజవర్ధన్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని స్లేట్ సీబీఎస్ఈ ప్రయివేటు పాఠశాలలో నిర్వహించిన మండల స్థాయి బ్యాడ్మింటన్ పోటీల ప్రారంభోత్సవంలో పాల్గొని మాట్లాడారు. మండల స్థాయి పోటీలు నిర్వహిస్తున్న నిర్వాహకులకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలు శారీరక దారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయన్నారు. ఓడినవారు గెలిచిన వారిని ఆదర్శంగా తీసుకొని మరోసారి గెలవడానికి ప్రయత్నించాలన్నారు. ఓడిన వారు కృంగిపోకుండా గెలిచిన వారిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి ఫణి రాజు, పాఠశాల చైర్మన్ ఏనుగు శ్రీకాంత్‌రెడ్డి, వివిధ పాటల శాలలకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

నారాయణ స్కూల్‌లో థాంక్స్ గివింగ్ డే

నవతెలంగాణ-మంచిర్యాల

జిల్లా కేంద్రంలోని నారాయణ స్కూల్‌లో థాంక్స్ గివింగ్ డే కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన పాఠశాల ఏజీఎం చైతన్య రావు మాట్లాడుతూ చిన్నతనం నుంచే పిల్లలు ఇతరులకు సాయం చేసే గుణాన్ని అలవర్చుకోవాలని తెలిపారు. అనంతరం అనాథ పిల్లల ఆశ్రమంలో పాఠశాల విద్యార్థుల చే బుక్కులు పెన్నులు బట్టలు, పండ్లు పంపిణీ చేయించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ కవిత, సిబ్బంది సత్యంరావు, వెంకటస్వామి, సందీప్, స్రవంతి పాల్గొన్నారు.

యూనివర్సిటీ పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు సన్మానం

నవతెలంగాణ-నస్పూర్

యూనివర్సిటీ జోనల్ స్థాయి బాక్సింగ్ పోటీలలో పాల్గొనుటకు జిల్లాలో జేఎన్టీయూహెచ్ యూనివర్సిటీ నుంచి నబిల ఆనం, కాకతీయ యూనివర్సిటీ నుంచి అలేఖ్య ఎంపిక అయ్యారు. బాక్సింగ్ క్రీడాకారులను మంచిర్యాల జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ సెక్రెటరీ బోయిని రాజ్ కుమార్ అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అసోసియేషన్ నిర్వహించే ఉచిత వేసవి బాక్సింగ్ శిక్షణ శిబిరాలను ఉపయోగించుకొని జిల్లా నుంచి జాతీయ స్థాయిలో పాల్గొనటం శుభ పరిణామం అని, పదుల సంఖ్యలో జిల్లా నుండి జాతీయ స్థాయిలో పాల్గొంటున్న క్రీడాకారులకు ప్రభుత్వం నుంచి సహాయ సహకారాలు అందిస్తే మరిన్ని ఫలితాలు వస్తాయని తెలిపారు. రానున్న రోజుల్లో అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతి మండలానికి బాక్సింగ్ శిక్షణ శిబిరాలను ఏర్పాటు చేస్తామని, రాష్ట్ర, జాతీయ స్థాయిలో క్రీడాకారులను తయారు చేయటం తమ లక్ష్యం అని అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు పాదం రవీందర్, చైర్మన్ మైసూర్, సీఐఎస్ఎఫ్ బాక్సింగ్ క్రీడాకారుడు పాదం మహేందర్, కోచ్ జగత్ సాయి, సందీప్, అశోక్ అభినందించారు.